

# అటవీ హక్కుల చట్టం
# (ఎఫ్.ఆర్.ఏ.)

## ఫెసిలిటేటర్ల మార్గదర్శిని

పశు పోషక సమూహాలతో పనిచేసే సంస్థలకు మార్గదీపిక



Centre for
Pastoralism

Centre for Pastoralism

# అటవీ హక్కుల  చట్టం (ఎఫ్.ఆర్.ఏ.) - ఫెసిలిటేటర్ల మార్గదర్శిని
## పశు పోషక సమూహాలతో పని చేసే సంస్థలకు మార్గదీపిక


**సంకలనం**

వియోన మోహన్

తుషార్ దాసు

**విషయ సహకారం**

రమేష్ భట్టి

వసంత సబర్వాల్

శౌర్యమయ దాస్

అమిత్ రాథీ

**ప్రచురణ:** సెంటర్ ఫర్ పాస్టోరలిజం, ఆగస్టు 2021

CC BY NC SA

**డిజైన్:**

**అనూజా ఘోఖానీ**

**ఎడిటింగ్:**

**చానీ బంగ్ సుట్**

సెంటర్ ఫర్ పాస్టోరలిజం
155, షా పుర్ జాట్ విలేజి
థర్డ్ ఫ్లోర్, న్యూఢిల్లీ 110049

www.centreforpastoralism.org

**అన్నిహక్కులు రిజర్వ్ చేయబడ్డాయి**

ఈ డాక్యుమెంట్ సిసి బివై--ఎన్ సి - ఎస్ఏ కింద కాపీ రైట్ పొందింది
(ఆట్రిబ్యూషన్-నాన్ కమర్షియల్-షేర్ ఏ లైక్) లైసెన్సు.

**సహాయం:**
**రోహిణీ నీలకేణి ఫిలాంత్రపీస్**
**అజీం ప్రేంజీ ఫౌండేషన్**

**కృతజ్ఞతలు:**
**మెటీరియల్, డాక్యుమెంటేషన్ సహకారం అందించిన**

**ఈ కింది సంస్థలకు మా కృతజ్ఞతలు:**

**సహజీవన్**

హిమాచల్ ఘుమాంటు పశుపాలక్ మహాసభ (హెచ్.జి.పి.ఎం.)

**మెటీరియల్, శిక్షణా మాడ్యూల్స్ రూపకల్పన:**

నేషనల్ రిసోర్స్ సెంటర్ (ఎస్.సి. & ఎస్.టి.ఆర్టిఐ క్యాంపస్, భువనేశ్వర్)
గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ
యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం - ఎస్.సి. & ఎస్.టి. డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్

# ముందు మాట

పశు జీవాలను పెంచే ప్రజా సమూహాలకు అటవీ హక్కుల చట్టం (ఎఫ్.ఆర్.ఏ.) కల్పించే హక్కులు, ప్రయోజనాలను అందించడానికి ప్రయత్నం చేసే వాళ్ళందరికీ అవసరమైన సూచనలు, మార్గదర్శకత్వం అందించడం ఈ పుస్తకం ఉద్దేశం. ఎఫ్.ఆర్.ఏ. పరిధిలో పొందుపరిచిన విభిన్న రకాల హక్కులు, వాటి నిర్వచనాలు, దరఖాస్తుల ప్రక్రియలో ఉపయోగించే విభిన్న పదాలకు అర్థాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. అందిన దరఖాస్తులను పరిశీలించి హక్కులను ధృవీకరించడానికి వివిధ స్థాయిల్లో పని చేసే అధికార యంత్రాంగం, వాటి విధులు, బాధ్యతలు, సమస్యల పరిష్కార వ్యవస్థలకు సంబంధించిన సమాచారం కూడా ఇందులో ఉన్నది. ఎఫ్.ఆర్.ఏ. హక్కుల ప్రక్రియలో ఆయా స్థాయిల్లో (గ్రామ సభ (జి.ఎస్.)/ సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.)/జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)) పనిచేసే అధికారులు తమ విధులు సక్రమంగా నిర్వహించేలా చేయడం, వాళ్ళల్లో జవాబుదారీతనం పెంచడానికి ఉపయోగపడే సూచనలు, చట్టపరంగా ముఖ్యమైన అంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. హక్కుల కోసం దరఖాస్తులు (క్లెయింలు) చేసే ప్రక్రియలో ఉపయోగపడే విభిన్న రకాల సాక్ష్యాధారాలు, మ్యాపులు కూడా ఈ పుస్తకంలో పొందుపరచడం జరిగింది. అదే క్రమంలో గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాలలో పశు పోషకులకు ఎఫ్.ఆర్.ఏ. హక్కులు సాధించే క్రమంలో అక్కడి ఫెసిలిటేటర్లు ఎదుర్కున్న సంక్లిష్ట సవాళ్లను కూడా వాళ్ళ వాస్తవిక అనుభవాల ద్వారా వివరించే ప్రయత్నం ఈ పుస్తకంలో ఉంది.



ఫోటో క్రెడిట్: రితాయన్ ముఖర్జీ

చాంగ్రాంగ్, లడఖ్ ప్రాంతంలో తమ యాక్ జీవాలతో చాంగ్పా పశుపోషకులు

# విషయ సూచిక

## 01/ పశుపోషణ - అటవీ హక్కుల చట్టం


* అటవీ హక్కుల చట్టం అంటే ఏమిటి 08
* పశు పోషణ – అటవీ హక్కుల చట్టం 09
* కీలక నిర్వచనాలు 13


## 02/ అటవీ హక్కుల చట్టం పరిధిలో పశు పోషక సమూహాల హక్కులు


* అటవీ హక్కుల చట్టం & పశు పోషక సమూహాల హక్కులు 16

## 03/ అధికార యంత్రాంగం - విధులు

* అటవీ హక్కుల దరఖాస్తు, గుర్తింపు ప్రక్రియలలో ఎఫ్.ఆర్.ఏ. పరిధిలో ఏర్పాటైన అధికార యంత్రాంగం పాత్ర 18
* గ్రామ సభ 20
* అటవీ హక్కుల కమిటీ (ఎఫ్.ఆర్.సి.) 22
* సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) 23
* జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) 24
* రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కమిటీ (ఎస్.ఎల్.ఎం.సి.) 25

## 04/ అటవీ హక్కుల దరఖాస్తు ప్రక్రియ - హక్కుల నిర్ధారణ

* అటవీ హక్కుల దరఖాస్తు ప్రక్రియ 28
* పరిపాలన పరమైన హద్దుల మధ్య పశు పోషక హక్కుల దరఖాస్తులు 30
* సాక్ష్యాధారాలు 31
* మ్యాపింగ్ 36

## 05/ వివాదాల పరిష్కారం - అప్పీళ్ళు

* వివాదాల పరిష్కారం – అప్పీళ్ళు 40
* అప్పీళ్ళ ప్రక్రియలో అధికారులు కీలక విధులు 41

## 06/ కేస్‌స్టడీలు - నేర్చుకునే అంశాలు

* కేస్ స్టడీ 1 44
* కేస్ స్టడీ 2 48

# పశు పోషణ - అటవీ హక్కుల చట్టం (ఎఫ్.ఆర్.ఏ.)



అటవీ హక్కుల చట్టం అడవి మీద ఆధారపడి జీవించే ప్రజల హక్కులను గుర్తిస్తుంది. పశు జీవాలను పోషిస్తూ బతికే ప్రజలకు కూడా ఆ హక్కులు ఉంటాయని ఈ చట్టం చెబుతోంది. అడవి మీద ఆధారపడి జీవించే ఇలాంటి ప్రజా సమూహాలు తమ జీవనోపాధులతో సహా, ఇతరత్రా విభిన్న అవసరాల కోసం అటవీ వనరులను వాడుకునే హక్కులను ఈ చట్టం స్పష్టంగా నిర్దేశించింది.

## అటవీ హక్కుల చట్టం అంటే?

అటవీ హక్కుల చట్టం, 2006 ఒక విప్లవాత్మక చట్టం. ఇది అడవి మీద ఆధారపడి బతికే విభిన్న ప్రజా సమూహాలకు, గిరిజనులకు మాత్రమే కాకుండా, జీవనోపాధులు, ఆవాస వసతులు, సామాజిక-సాంస్కృతిక అవసరాలు వంటి విభిన్న అవసరాల కోసం సాంప్రదాయకంగా అటవీ వనరుల మీద ఆధారపడి బతికే అనేకమంది ప్రజలకు అడవి మీద అవసరమైన హక్కులు కల్పించింది.

భారతదేశంలోని అడవులు లక్షలాది మందికి నివాస ప్రాంతాలు: పశువులను పోషిస్తూ , వాటి పోషణకు అటవీ వనరులపై ఆధారపడి బతికే అనేక ప్రజా సమూహాలు/కమ్యూనిటీలకు చెందిన ప్రజలు ఈ అడవులలో నివసిస్తూ ఉన్నారు. ఎన్నో ఏళ్ళుగా ఇలాంటి కమ్యూనిటీలకు, అడవులకు అంతర్గతంగా విడదీయరాని సన్నిహిత సంబంధం ఉంది. తమ జీవన మనుగడకు అడవులు ఎంత ముఖ్యమనే విషయం వీళ్ళకు బాగా తెలుసు. అందుకే, అటవీ వనరులను ఈ కమ్యూనిటీలు ఉమ్మడి యాజమాన్యంతో నిర్వహించుకుంటాయి: దానికి అవసరమైన ఉమ్మడి కట్టుబాట్లు, నిబంధనలు పెట్టుకుంటాయి: అనువైన ఆచార సాంప్రదాయాలను రూపొందించుకుని వాటిని పాటిస్తూ ఉంటాయి. అడవులలో దొరికే కలపను అత్యంత ముఖ్యమైన వాణిజ్య సరకుగా భావించిన బ్రిటిష్ పాలకులు క్రమంగా అటవీ వనరులపై నియంత్రణలు విధించారు. దాంతో సాంప్రదాయంగా అడవి మీద ఆధారపడి బతికే వాళ్లకు అడవి మీద పట్టు తగ్గింది. వాళ్ళకున్న సాంప్రదాయ హక్కులు కూడా లేకుండా పోయాయి. కాలక్రమేణా, ఇది అనేక విపరీత పరిణామాలకు దారి తీసింది. అడవి వాళ్ళది కాకుండా పోయింది. వాళ్ళ బతుకు తెరువులకు ఆధారం పోయింది.

ఈ పరిస్థితులలో వచ్చిన అటవీ హక్కుల చట్టం, 2006 ఒక విప్లవాత్మక చట్టం. అడవి మీద ఆధారపడి బతికే విభిన్న ప్రజా సమూహాలకు, గిరిజనులకు మాత్రమే కాకుండా,జీవనోపాధులు, ఆవాస వసతులు, సామాజిక-సాంస్కృతిక అవసరాలు వంటి విభిన్న అవసరాల కోసం సాంప్రదాయకంగా అటవీ వనరుల మీద ఆధారపడి బతికే అనేక మంది ప్రజలకు ఈ చట్టం అడవి మీద హక్కులు కల్పించింది. అటవీ హక్కుల చట్టం రూపొందించే నాటికి, అటవీ సంరక్షణ పరంగా అడవి మీద ఆధారపడి బతికే కమ్యూనిటీలు, వాళ్ళ సాంప్రదాయ పరిజ్ఞానం పోషించే పాత్రను, ప్రాధాన్యతను అప్పటివరకు ఏ అటవీ యాజమాన్య విధానం కూడా అంతగా గుర్తించలేదు. అది వలస పాలనలో కావచ్చు; స్వాతంత్ర్యానంతర కాలంలో కావచ్చు. ఈ చట్టానికి ఉన్న ప్రాధాన్యత అదే.

ఈ చట్టం వ్యక్తిగత అటవీ హక్కులను, ఉమ్మడి అటవీ హక్కులను రెండింటినీ గుర్తిస్తుంది. వ్యక్తిగత అటవీ హక్కుల పరిధిలో – స్వంతంగా అక్కడి భూమిని సాగు చేసుకోవడం, అడవిలో నివాసం ఉండటం– వంటి హక్కులు కూడా ఉన్నాయి. ఇక ఉమ్మడి అటవీ హక్కుల పరిధి ఇంకా విస్తృతమైనది. అడవి మీద ఆధారపడి బతికే కమ్యూనిటీలు ఆ క్రమంలో అడవితో సుస్థిర సంబంధాలు కొనసాగించడానికి సాంప్రదాయంగా చేపట్టే కార్యక్రమాలు అన్నీ ఆ హక్కుల పరిధిలో ఉన్నాయి. పశుపోషణకోసం అడవి మీద సీజనల్‌గా ఆధారపడి బతికే పశు పోషక సమూహాల హక్కులు కూడా ఆ పరిధిలో భాగమే. అటవీ హక్కుల చట్టం షెడ్యూల్డ్ జాతుల (ఎస్.టి.లు) ప్రజలతో పాటుగా అడవి మీద ఆధారపడి బతికే ఇతర సాంప్రదాయ జాతుల (ఓ.టి.ఎఫ్.డి.లు) హక్కులను కూడా గుర్తిస్తుంది. అంటే, షెడ్యూల్డ్ జాతుల (ఎస్.టి.లు) వాళ్ళతో పాటు నాన్-ఎస్.టి సాంప్రదాయ అటవీజాతుల



హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రాలో ఎత్తయిన పర్వత ప్రాంతాలలోని పచ్చిక బయళ్ళలో గొర్రెలు మేయడం

(ఓ.టి.ఎఫ్.డి.లు)కు చెందిన వాళ్ళకు కూడా అటవీ హక్కుల చట్టం ప్రకారం అడవి మీద హక్కులు ఉంటాయి. ఇలాంటి వాళ్ళందరూ బతకడానికి అవసరమైన మౌలిక అవసరాల కోసం అటవీ భూమిని ఇతరత్రా రూపాలోక్లి మార్చడానికి కూడా ఈ చట్టం తగిన వెసులుబాటు కల్పించింది. షెడ్యూల్డ్ జాతుల (ఎస్.టి.లు) వాళ్ళను,నాన్-ఎస్.టి సాంప్రదాయ అటవీజాతుల (ఓ.టి.ఎఫ్.డి.లు) కు చెందిన వాళ్ళను అడవి నుంచి బయటకు వెళ్ళగొట్టకుండా, అటవీ భూమిని వాళ్ళకు దూరం చేయకుండా ఈ చట్టం వాళ్లకు తగిన రక్షణ ఇస్తుంది.

## అటవీ ఆధారిత పశుపోషణ - అటవీ హక్కుల చట్టం

భారతదేశంలో 10–12 మిలియన్ల మంది, అంటే కోటినుంచి కోటీ ఇరవై లక్షల మంది అడవి మీద ఆధారపడి పశు జీవాలను పోషిస్తున్నట్టు ఒక అంచనా. వీళ్ళసంఖ్య 3.5 కోట్ల కంటే ఎక్కువగానే ఉంటుందని మరికొంత మంది వాదన. వీళ్ళంతా దాదాపు 200 జాతులు/తెగలకు చెందిన వాళ్ళు; అందరూ కలిసి 5 కోట్లకు మించి పశు జీవాలను పెంచి పోషిస్తున్నారని ఒక లెక్క. ప్రభుత్వ అడవులను రిజర్వు అడవులుగానూ, ఇతర రకాల అడవులుగానూ మార్చడం మొదలయ్యాక, గిరిజనులు, ఇతర అటవీ జాతుల మాదిరిగానే, అటవీ ఆధారిత పశు పోషకుల మీద కూడా ప్రభావం పడింది. అడవిలోని భూమికి, వనరులకు వాళ్ళు కూడా దూరమయ్యారు. ప్రభుత్వ అడవులను రిజర్వు అటవీ ప్రాంతాలుగా నోటిఫై చేయడంతో వీళ్ళంతా అడవి మీద, అటవీ వనరుల మీద తమ పట్టును, నియంత్రణను కోల్పోయారు. కచ్ ప్రాంతంలోని బన్నీ పచ్చిక బయలు (దీనిని రక్షిత అటవీ ప్రాంతంగా నోటిఫై చేశారు), హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాలోఉన్న బారా బంగాహాల్ (దీనిని వన్య ప్రాణి సంరక్షణ కేంద్రంగా గుర్తించారు) అడవులు దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

అటవీ ఆధారిత పశు పోషకులలో సంచారం ఎక్కువ. వాళ్లు ఒక చోట ఉండరు. ఈ సంచార స్వభావం అటవీ హక్కుల పరంగా వాళ్ల జీవనానికి మరికొంత సంక్లిష్టతను జోడిస్తున్నది. అటవీ హక్కుల చట్టం పరిధిలో ఇలాంటి పశు పోషక సమూహాల నుంచి తక్కువ స్థాయిలో హక్కుల దరఖాస్తులు రావడానికి కారణం – ఒకరకంగా ఈ సంచార స్వభావం, దానివల్ల ఉత్పన్నమవుతున్న సంక్లిష్టతనే. ఈ సంచార స్వభావం వల్ల ఈ కమ్యూనిటీల వాళ్ళు సీజనల్‌గా తమ నివాస ప్రాంతాలను మారుస్తూ ఉంటారు. ఒక్కోసారి ఒక్కోచోట నివాసం ఉంటారు. ఒకే ఏడాదిలో, విభిన్న సమయాలలో, విభిన్న వర్గాల వాళ్ళతో కలిసినివాసం ఉంటూ ఆయా గ్రామాల ఉమ్మడి వనరులను వినియోగించుకుంటూ ఉంటారు. దీనివల్ల రెండు రకాల సమస్యలు వస్తున్నాయి. ఒకటి –ఈ రీతిలో పశు జీవాలను మేపడానికి అడవిని వాడుకోవడానికి అటవీ శాఖ అడ్డు చెప్పడం. ఇలా చేయడం వల్ల అడవిలో జీవ వైవిధ్యత, పర్యావరణ వైవిధ్యత, పర్యావరణ వ్యవస్థలోని విభిన్న వనరులు దెబ్బ తింటాయని అటవీ శాఖ వాదన.



ఫోటో క్రెడిట్: ఇషాన్ రఘు నందన్

కచ్ ప్రాంతంలోని ముళ్ళ
అటవీ ప్రాంతంలో మేకల కాపరులు



ఫోటో క్రెడిట్: అమిత్ రాథ్

ఉత్తరాఖండ్‌లో వన్ గుజ్జార్ జాతి
పశు పోషకుల దున్నలు





ఫోటో క్రెడిట్: ఎమ్మాన్యూల్ థియోపిలస్

కుమావూ అటవీ భూముల్లో గొర్రెల మంద



ఫోటో క్రెడిట్: శౌర్యమయ్యి

ధావల్ పూరి పచ్చిక బయలు ప్రాంతంలో కుక్కల కాపలాతో దెక్కనీ గొర్రెల మేపకం.

ఇక రెండవది – అటవీ గ్రామాల ఉమ్మడి వనరులను పంచుకునే విషయంలో అప్పటికే అక్కడ సెటిల్ అయిన వాళ్లకు, సంచార జాతులకు మధ్య పోటీ, ఘర్షణ. మొత్తంగా ఇలాంటి అంశాల వల్ల పశు జీవాలను పెంచే వాళ్ళకు పచ్చిక మేత ప్రాంతాల అందుబాటు అనేది ఒక తీవ్రమైన సమస్యగా మారింది.

సీజన్ బట్టి ప్రాంతాలు మారుతూ ఉండటం ఈ కమ్యూనిటీలలో ఒక రకమైన అభద్రతకు తావునిస్తోంది. పైన తెలిపిన రెండు రకాల పరిస్థితులలోనూ వాళ్ళ హక్కుల విషయంలో సంక్లిష్టతకు ఇది దారి తీస్తోంది. అటవీ వనరుల మీద హక్కులు పొందడానికి వాళ్ళు రెండు రకాలుగా పోరాడాల్సి వస్తోంది. మామూలుగా వీళ్ళు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్ళడమే కాకుండా, ఒకసారి వెళ్ళిన ప్రాంతానికి మళ్లీ కొంతకాలం తరువాత తిరిగి వస్తూ ఉంటారు. ఈ రీతిలో ఆ ప్రాంతాలకు వాళ్ళు మధ్య మధ్యలో వచ్చి పోతుండే అతిథులు. ఒక ఏడాదిలో ఒక ప్రాంతానికి ఒక్కోసారి 6 నెలల పాటు రారు. ఒక్కోసారి అది ఇంకా ఎక్కువ కాలం కూడా కావచ్చు. మరో క్లిష్టమైన అంశం – ఎక్కువగా జనం సెటిల్ అయిన అటవీ ప్రాంతాలలో స్థానికంగా నివాసం ఉంటూ, వ్యవసాయం చేసుకుంటూ, అక్కడి గ్రామ ఉమ్మడి వనరులను విభిన్న అవసరాలకు వినియోగించుకునే వాళ్ళతో వీళ్ళు మేత ప్రాంతాల హక్కుల కోసం పోటీ పడాల్సిన పరిస్థితి. ఈ రెండు సందర్భాలలోనూ, ఈ సంచార పశు పోషకులను 'బయటి వాళ్ళు'గానే చూడటం జరుగుతున్నది. స్థానికంగా సెటిల్ అయిన వాళ్ళతో పోటీపడి హక్కులు సాధించుకునే బలం వీళ్ళకు ఉండదు. నిర్ణయాల పరంగా రాజకీయ ఒత్తిళ్లను ప్రభావితం చేసే శక్తి కూడా వీళ్ళకు లేదు.

అటవీ హక్కుల చట్టం ప్రకారం, హక్కుల దరఖాస్తు ప్రక్రియ గ్రామసభ స్థాయిలో మొదలవుతుంది. పశు పోషక జాతులకు చెందిన వాళ్ళ ప్రాతినిధ్యం, భాగస్వామ్యం కూడా ఉండే గ్రామ సభ ద్వారా అక్కడ అటవీ హక్కుల కమిటీ (ఎఫ్.ఆర్.సి.) ఏర్పాటవుతుంది. గ్రామసభ నియమించిన ఈ అటవీ హక్కుల కమిటీ అక్కడి ప్రజల నుంచి అటవీ హక్కుల దరఖాస్తులను కోరుతుంది. ఆయా దరఖాస్తులు, తగిన సాక్ష్యాధారాలు పరిశీలించిన తరువాత, రాత పూర్వకంగా ఆ హక్కులను గుర్తిస్తుంది. వాటిని ఆ పశు పోషక కమ్యూనిటీ సభ్యుల ముందు పెట్టి ధృవీకరిస్తుంది. ఆ తరువాత, దరఖాస్తు ద్వారా గుర్తించిన ప్రాంతాన్ని మ్యాప్ చేస్తుంది. ఇలా హద్దులు గుర్తిస్తుంది. దరఖాస్తు మేరకు పరిశీలించి, ధ్రువీకరించిన వివరాలతో గ్రామసభ ఒక తీర్మానం చేస్తుంది. ఆ తీర్మానాన్ని ఆమోదం కోసం సబ్–డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.)కి పంపుతుంది. ఈ క్లెయిం మీద ఎస్.డి.ఎల్.సి. తన సూచనలు, సిఫారసులు చేస్తూ, పరిశీలన నిమిత్తం జిల్లా స్థాయి కమిటీ (డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ – డి.ఎల్.సి.)కి పంపుతుంది. ఆ మేరకు జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) 'రికార్డ్ ఆఫ్ రైట్స్' రూపొందించి, దరఖాస్తుదారులకు టైటిల్ హక్కులు జారీ చేస్తుంది. ఈ మూడు స్థాయిలలో (గ్రామ సభ/ ఎస్.డి.ఎల్.సి./ డి.ఎల్.సి.) దరఖాస్తు తిరస్కరించబడినా లేదా ఏవైనా మార్పులు సూచించబడినా, ఆ విషయాన్ని దరఖాస్తు దారులకు రాత పూర్వకంగా తెలియ చేయాల్సి ఉంటుంది.

## ముఖ్యమైన నిర్వచనాలు

అడవి మీద ఆధారపడే పశు పోషక జాతులు/ సమూహాలకు సంబంధించి, అటవీ హక్కుల చట్టం పరిధిలో కొన్ని ముఖ్యమైన నిర్వచాలు ఈ దిగువ తెలిపిన రీతిలో ఉన్నాయి.

* **'అటవీ భూమి'** – అటవీ హక్కుల చట్టం సెక్షన్ 2(డి) దీనిని నిర్వచించింది. ఈ నిర్వచనం ప్రకారం అటవీ భూమి అంటే – ఏ అడవి పరిధిలోనైనా ఉండి, అందులో ఏ రకంగానైనా గుర్తించిన ఏదైనా భూమి అని అర్థం. ఆ అడవులు – ఇంకా వర్గీకరించని (అన్-క్లాసిఫైడ్) అడవులు కావచ్చు, ఇంకా హద్దులు గుర్తించబడని అడవులు కావచ్చు, ఇప్పటికే గుర్తించిన అడవులు కావచ్చు. అడవులు అని భావించబడుతున్న అడవులు కావచ్చు. రక్షిత అడవులు కావచ్చు, రిజర్వు అడవులు కావచ్చు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు లేదా జాతీయ పార్కులు కావచ్చు. ఇక్కడ గుర్తించాల్సిన అంశం ఏమిటంటే, అన్ని రకాల అటవీ భూములు – అవి అటవీ శాఖ పరిధిలో రికార్డ్ చేసిన అడవులకు సంబంధించినవి కావచ్చు లేదా అప్పటికి ఇంకా రికార్డు కాని అడవులు సంబంధించినవి కావచ్చు ఆ అటవీ భూములన్నీ అటవీ హక్కుల చట్టం పరిధిలోకి వస్తాయి.

* **సాముదాయక ఆటవీ వనరులు** – అంటే – సాంప్రదాయక హద్దులు లేదా గుర్తించబడిన హద్దులు కలిగిన ఏదేని ఒక గ్రామ హద్దుల పరిధిలో ఉన్న అటవీ భూమి కావచ్చు లేదా పశు పోషక సమూహాలు/తెగలకు చెందిన ప్రజలు సీజనల్‌గా వినియోగించుకునే భూ పరిధి కావచ్చు; వాటిని సాముదాయక అటవీ వనరులుగా నిర్వచించారు. పశు పోషక కమ్యూనిటీలకు సంప్రదాయకంగా అందుబాటులో ఉన్న రిజర్వు అడవులు, రక్షిత అడవులు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, జాతీయ పార్కులు వంటి రక్షిత ప్రదేశాలు అన్నీ కూడా ఈ నిర్వచన పరిధిలోకి వస్తాయి.


* **ఎస్.టి./ఓ.టి.ఎఫ్.డి. కేటగిరీ నిర్వచనం:**

అడవిలో నివాసముండే షెడ్యూల్డ్ జాతులు (ఎస్.టి.లు): ప్రధానంగా అడవిలో నివసిస్తూ, తమ బతుకు దెరువు అవసరాల కోసం అడవి మీద కానీ, అటవీ భూముల మీద కానీ ఆధారపడే షెడ్యూల్డ్ జాతుల ప్రజలు లేదా సమూహాలు అందరూ ఈ నిర్వచన పరిధిలోకి వస్తారు. ఆ క్రమంలోనే షెడ్యూల్డ్ జాతులకు చెందిన పశు పోషక కమ్యూనిటీలు కూడా ఈ నిర్వచన పరిధిలో ఉన్నారు.

* ఓ.టి.ఎఫ్.డి.: **ఇతర సాంప్రదాయక అటవీ జాతులు (ఓ.టి.ఎఫ్.డి.)** –అంటే, 13 డిసెంబర్ 2005 కన్నా ముందు, మూడు తరాలుగా అడవిలో నివాసముంటూ, తమ బతుకుతెరువు అవసరాల కోసం ప్రధానంగా అడవి మీద కానీ లేదా అటవీ భూముల మీద కానీ ఆధారపడి బతుకుతున్న వ్యక్తులు లేదా కమ్యూనిటీలు ఎవరైనా ఈ నిర్వచన పరిధిలోకి వస్తారు.



రిజర్వు అడవి



రక్షిత అడవి




జాతీయ పార్కు



వన్యప్రాణి సంరక్షణ కేంద్రం

# అటవీ హక్కుల చట్టం పరిధిలో పశు పోషక సమూహాల హక్కులు



పశు పోషక సమూహాలకు చెందిన వాళ్ళు జీవాల మేత వనరుల మీద తమకుండే సాంప్రదాయ హక్కులు సాధించుకోవడానికి గాను అటవీ హక్కుల చట్టంలోని అనేక సబ్ సెక్షన్లలో అనేక రకాల హక్కులు పొందు పరిచారు.

## అటవీ హక్కులు &
## పశు పోషక సమూహాల హక్కులు

అటవీ హక్కుల చట్టం పరిధిలో హక్కుల దరఖాస్తు ప్రక్రియలో తరచుగా వాడే పలు ముఖ్యమైన హక్కులు, వాటి సబ్ సెక్షన్ల వివరాలు ఈ కింద ఇవ్వబడ్డాయి.

### సాముదాయిక అటవీ హక్కులు (సి.ఎఫ్.ఆర్.):

వీటిలో ఈ కింద తెలిపిన హక్కులు ఉంటాయి.

1. జీవాలను మేపడం

2. అడవులలో ఉండే నీటి వనరుల వినియోగం, చేపల పెంపకం

3. సంచార పశు పోషక కమ్యూనిటీలకు చెందిన వాళ్ళకు సీజనల్ సాంప్రదాయ వనరుల అందుబాటు: ఈ సంచార పశు పోషక జాతులకు సీజనల్ వారీగా వాళ్ళు వెళ్ళే మార్గాలలో మేత భూములు/ పచ్చిక బయళ్ళ అందుబాటు హక్కులు

4. జీవ వైవిధ్యత – అందుబాటు హక్కులు

5. సాంప్రదాయ పరిజ్ఞానం, మేధోపర హక్కులకు సంబంధించి కమ్యూనిటీ హక్కులు

6. సాంప్రదాయ ఆచార వ్యవహార హక్కుల గుర్తింపు

7. ఏ రకమైన సాముదాయక అటవీ వనరునైనా, దాని సుస్థిర వినియోగం కోసం అవసరమైన రక్షణ, సంరక్షణ, పునరుత్పాదన, యాజమాన్య నిర్వహణ చేసే హక్కులు

అటవీ హక్కుల చట్టం, సెక్షన్ 3 కింద పశు పోషక జాతుల ప్రజలకు ఉండే ముఖ్యమైన హక్కులు:

1. సెక్షన్ 3 (1) (బి): సాముదాయిక హక్కులు లేదా 'ఇస్టార్' హక్కులు, పూర్వపు సంస్థానాలు, జమీందారీ వ్యవస్థ వంటి మధ్య రకపు పాలనా వ్యవస్థల ద్వారా సంక్రమించిన హక్కులు కూడా కలుపుకుని.

2. సెక్షన్ 3 (1) (సి): గ్రామ సరిహద్దుల లోపల, బయట సాంప్రదాయకంగా సేకరిస్తూ వస్తున్న చిన్న తరహా అటవీ ఉత్పత్తుల సేకరణ, వినియోగం, విసర్జన పరంగా ఆయా ఉత్పత్తుల అందుబాటు, యాజమాన్య సంబంధిత హక్కులు

3. సెక్షన్ 3 (1) (డి): అడవులలోని నీటి వనరులు, మేత భూములు (స్థిరమైనవి లేదా సీజనల్ సంచారంలో మేపే భూములు – ఈ రెండూ కావచ్చు), నీటి వనరుల ద్వారా అందే చేపలు, ఇతర ఉత్పత్తుల వినియోగం, ప్రయోజనాలపై సాముదాయిక హక్కులు, సంచార పశు పోషక జాతులకు చెందిన వాళ్లకు సీజనల్ సాంప్రదాయక వనరుల అందుబాటు.

4. సెక్షన్ 3(1) (ఐ): సాంప్రదాయకంగా కాపాడుకుంటూ, సంరక్షించుకుంటున్న ఏ రకమైన సాముదాయిక అటవీ వనరునైనా, దాని సుస్థిర వినియోగం కోసం అవసరమైన రక్షణ, సంరక్షణ, పునరుత్పాదన, యాజమాన్య నిర్వహణ చేసే హక్కులు.

5. సెక్షన్ 3(1) (కె): జీవ వైవిధ్యత, సాంస్కృతిక వైవిధ్యతకు సంబంధించిన సాంప్రదాయ పరిజ్ఞానం, మేధోపర విజ్ఞాన సంబంధిత సాముదాయిక హక్కులు.

## అధికార యంత్రాంగం
## & విధులు




అటవీ హక్కుల చట్టం పరిధిలో
దరఖాస్తుల పరిశీలన,
హక్కుల గుర్తింపు ప్రక్రియల
నిర్వహణకు విభిన్న స్థాయిల్లో
విభిన్న అధికార వ్యవస్థలను నిర్వచించారు.
అదే క్రమంలో ఆయా అధికార వ్యవస్థల విధులు,
బాధ్యతలు కూడా ఈ చట్టంలో స్పష్టంగా పొందుపరిచారు.

## అటవీ హక్కుల చట్టం పరిధిలో దరఖాస్తుల పరిశీలన, హక్కుల గుర్తింపు ప్రక్రియల నిర్వహణకు ఏర్పాటైన అధికార యంత్రాంగపు పాత్ర

అడవులకు సంబంధించిన నమూనా మ్యాపుల డ్రాయింగు ప్రక్రియతో అటవీ హక్కుల దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఆయా గ్రామాల ప్రజలు రూపొందించే ఈ మ్యాపుల తయారీ ప్రక్రియలో గ్రామ సభ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ మ్యాపులను క్షేత్రస్థాయిలో ధ్రువీకరించుకుని, వాటిని ఉన్నత అధికారులకు నివేదిస్తారు. ఈ అటవీ హక్కుల చట్టం పరిధిలో గ్రామసభను ఒక ప్రజా అధికారిక యంత్రాంగంగా గుర్తించారని, గ్రామసభ ద్వారా అందే దరఖాస్తు సిఫారసులను ఒకవేళ ఆ పై అధికారులు తిరస్కరిస్తే, అలా తిరస్కరించడానికి గల కారణాలను వాళ్ళు తగిన సాక్ష్యాధారాలతో వివరించాల్సి ఉంటుందనే ముఖ్యమైన విషయం ఇక్కడ గుర్తుంచుకోవాలి.

**అటవీ హక్కుల చట్టం పరిధిలో గ్రామ సభను అధికారిక వ్యవస్థగా పరిగణించాలి అనేది ఇక్కడ గమనించదగిన అంశం. గ్రామ సభ చేసిన సిఫారసులను ఉన్నత అధికారులు తిరస్కరిస్తే, దానికి గల కారణాలను స్పష్టం చేయాల్సి ఉంటుంది.**





సాముదాయిక అటవీ హక్కుల దరఖాస్తు కోసం గ్రామ సభ సమావేశం

# గ్రామ సభ (జి.ఎస్.)

ఏదైనా ఒక సముదాయంలో, వ్యక్తిగత అటవీ హక్కులు (ఐ.ఎఫ్.ఆర్.) కానీ లేదా సాముదాయిక అటవీ హక్కులు (సి.ఎఫ్.ఆర్.) కానీ లేదా ఆ రెండు రకాల హక్కులు కానీ ఇవ్వడానికి, ఆ హక్కుల దరఖాస్తుల స్వభావం, పరిధి నిర్ణయించడానికి అవసరమైన తొలి ప్రక్రియలు మొదలు పెట్టే అధికారం గ్రామసభదే.

## * గ్రామ సభ నిర్వహణ

పశు పోషక సమూహాలకు అందుబాటు, వాళ్ళు తిరిగే తీరు, ఆ మార్గాలు, వాళ్ళ అవసరాలు వంటి అంశాలకు అనుగుణంగా గ్రామ సభ నిర్వహించడానికి ఈ కింద తెలిపిన పద్ధతులు సూచించబడ్డాయి.

- పశు పోషకులలో అనేక కమ్యూనిటీలకు చెందిన వాళ్ళు ఆయా గ్రామాలలో స్థిరనివాసం ఏర్పరచుకుంటారు. పశు జీవాలను మేపడానికి గాను సీజనల్‌గా వేరే చోట్లకు వలస పోతుంటారు. ఇలాంటి సందర్భాలలో, గ్రామ సభను, అటవీ హక్కుల కమిటీని వాళ్ళు నివాసం ఉండే గ్రామాల్లోనే ఏర్పాటు చేయవచ్చు. దానివల్ల వాళ్ళు అటవీ హక్కుల కోసం దరఖాస్తులు పెట్టుకోవడం సులువవుతుంది. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఒకటుంది. తాము నివాసం ఉండే ఇలాంటి గ్రామాలలో ఈ పశు పోషక సమూహాలు ఇతర కమ్యూనిటీలతో కలిసి ఉంటారు. అందుకని గ్రామ సభ ఏర్పాటు క్రమంలో ఈ కమ్యూనిటీలకు చెందిన వాళ్లకు తగిన ప్రాతినిధ్యం ఉండేలా చూడాలి.
- తమ నివాసాలకు దూరంగా ఉండే పూర్తి సంచార జాతులు, పాక్షిక సంచార జాతుల విషయానికి వస్తే, వాళ్ళు అటవీ వనరులు వినియోగించే ప్రదేశానికి సమీపాన ఉండే గ్రామాలు/ ఆవాస ప్రాంతాలలో గ్రామ సభ నిర్వహించాలి. అప్పుడు అక్కడ స్థానికంగా నివాసం ఉండే వాళ్ళతో కలిసి ఈ కమ్యూనిటీల వాళ్ళు కూడా ఆ గ్రామ సభలో పాల్గొనేటట్టు చూడాలి.

## * గ్రామ సభ విధులు

అటవీ హక్కుల చట్టం పరిధిలో అటవీ హక్కులు పొందే ప్రక్రియలో గ్రామ సభ ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఆ అటవీ హక్కుల స్వభావం, పరిధిని నిర్ధారించే ప్రక్రియతో ఇది మొదలవుతుంది. తరువాత గ్రామ సభ ద్వారానే అటవీ హక్కుల కమిటీ (ఎఫ్.ఆర్.సి.) ఏర్పాటవుతుంది. ఎఫ్.ఆర్.సి. తీసుకునే నిర్ణయాలను కూడా గ్రామ సభనే సమీక్షిస్తుంది. పశు పోషక కమ్యూనిటీలు మామూలుగా ఏడాదిలో ఎక్కువ కాలం ఉమ్మడి వనరులకు దూరంగానే ఉంటారు. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని, ఈ కమ్యూనిటీలకు (వాళ్ళ వాళ్ళ ప్రతినిధుల ద్వారా గానీ లేదా వాళ్ళ సాంప్రదాయ సంస్థాగత వ్యవస్థల ద్వారా గానీ) గ్రామ సభ, అటవీ హక్కుల కమిటీలలో తగిన భాగస్వామ్యం ఉండేలా ఉండాలి. అటవీ హక్కుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలి. ఈ బాధ్యత గ్రామ సభ, అటవీ హక్కుల కమిటీలదే.

గ్రామ సభ విధులు ఈ కింద తెలిపిన రీతిలో ఉంటాయి:

- నిర్దిష్ట గ్రామ సభ పరిధిలో, అడవిలో నివాసం ఉంటున్న వాళ్ళకు ఇవ్వగలిగే అటవీ హక్కుల స్వభావాన్ని, పరిధిని నిర్ధారించడం.
- అటవీ హక్కులు కోరే వాళ్ళ నుంచి దరఖాస్తులు ఆహ్వానించడం, దరఖాస్తులు స్వీకరించడం.
- అటవీ హక్కులు కోరుతున్న వాళ్ళ జాబితా తయారు చేయడం, దరఖాస్తుదారుల వివరాలతో పాటు క్లెయిం వివరాలతో ఒక రిజిస్టర్ నిర్వహించడం.

- అందిన దరఖాస్తుల మేరకు ఆసక్తి కలిగిన వ్యక్తులు, అధికారులు అందరికీ వాదనలకు అవకాశం కల్పించిన తరువాత, అటవీ హక్కుల దరఖాస్తుల మీద తగిన తీర్మానం చేయడం, ఆ తీర్మానాలను సబ్-డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.)కి పంపడం.
- వన్య ప్రాణులు, అడవి, జీవ వైవిధ్యత కాపాడటానికి గాను, గ్రామ సభలో ప్రాతినిధ్యం ఉన్న సభ్యులను కొంతమందిని ఎంపిక చేసి కమిటీలను నియమించడం, అటవీ హక్కుల చట్టంలోని సెక్షన్ 5లో పొందుపరచిన అంశాలను ఈ కమిటీల ద్వారా అమలయ్యేటట్టు చూడటం.
- క్లాజు (ఇ) మేరకు ఏర్పాటైన అటవీ హక్కుల కమిటీ (ఎఫ్.ఆర్.సి.) పనితీరును పర్యవేక్షించడం, అడవిలో నివాసముండే షెడ్యూల్డ్ జాతులు, సాంప్రదాయ అటవీ జాతుల ప్రయోజనాలు కాపాడే రీతిలో, సాముదాయిక అటవీ వనరుల సుస్థిర వినియోగం, సమానత ప్రాతిపదికన వాటి సక్రమ యాజమాన్య నిర్వహణకు తగిన సంరక్షణ-యాజమాన్య ప్రణాళికను అటవీ హక్కుల కమిటీ (ఎఫ్.ఆర్.సి.) రూపొందించి అమలు చేసేలా చూడటం.
- పైన తెలిసిన రీతిలో అటవీ హక్కుల కమిటీ (ఎఫ్.ఆర్.సి.) ద్వారా రూపొందిన అటవీ వనరుల సంరక్షణ-యాజమాన్య ప్రణాళికను సంబంధిత అటవీ శాఖ (ఫారెస్టు డిపార్టుమెంట్) రూపొందించే సూక్ష్మ (మైక్రో) ప్రణాళిక, అమలవుతున్న ప్రణాళిక, ఇతర యాజమాన్య ప్రణాళికలతో అనుసంధానం చేయడం, ఆ క్రమంలో కమిటీ భావించిన మేరకు తన ప్రణాళికలో అవసరమైన మార్పులు/సవరణలు జరిగేలా చూడటం.
- రవాణా అనుమతులు, ఉత్పత్తుల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయ వినియోగం, యాజమాన్య ప్రణాళికలలో మార్పులు వంటి అంశాల పరంగా అటవీ హక్కుల కమిటీ తీసుకునే అన్ని నిర్ణయాలను పరిశీలించి ఆమోదించడం

**అటవీ హక్కుల చట్టం పరిధిలో అటవీ హక్కులు పొందే ప్రక్రియలో గ్రామ సభదే ప్రధాన పాత్ర. అటవీ హక్కుల స్వభావం, పరిధిని నిర్ధారించే ప్రక్రియతో ఇది మొదలవుతుంది. అటవీ హక్కుల కమిటీ (ఎఫ్.ఆర్.సి.) గ్రామ సభ ద్వారానే ఏర్పాటవుతుంది. ఈ ఎఫ్.ఆర్.సి. తీసుకునే నిర్ణయాలను కూడా గ్రామ సభనే సమీక్షిస్తుంది**

# అటవీ హక్కుల కమిటీ (ఎఫ్.ఆర్.సి.)

## * ఎఫ్.ఆర్.సి. ఎలా ఏర్పాటవుతుంది?

1. గ్రామ పంచాయితీ ద్వారా గ్రామ సభ నిర్వహించబడుతుంది. గ్రామ సభ తొలి సమావేశంలో సభ్యుల నుంచి పదిమందికి తక్కువ కాకుండా, 15 మందికి మించకుండా, సభ్యులను ఎన్నుకుని, వాళ్ళను అటవీ కమిటీ (ఎఫ్.ఆర్.సి.) సభ్యులుగా నియమించాలి. మూడింట రెండు వంతుల మంది సభ్యులు షెడ్యూల్డ్ జాతులకు చెందిన వాళ్ళు ఉండాలి. అంతేకాకుండా;

- ఆ సభ్యులలో మూడింట ఒక వంతు సభ్యులు మహిళలై ఉండాలి.
- ఒకవేళ షెడ్యూల్డ్ జాతుల వాళ్ళు అక్కడ లేకపోతే మొత్తం సభ్యులలో మూడింట ఒక వంతు సభ్యులు మహిళలై ఉండాలి.
- పశు పోషక జాతులు/ సమూహాలు ఉండే అనేక ప్రాంతాలలో షెడ్యూల్డ్ జాతుల వాళ్ళు ఉండకపోవచ్చు. అటువంటి ప్రాంతాలలో ఇతర సాంప్రదాయక అటవీ జాతుల వాళ్ళ నుంచి సభ్యులను ఎంపిక చేసి, అటవీ హక్కుల కమిటీ (ఎఫ్.ఆర్.సి.) ఏర్పాటు చేయవచ్చు.

2. అటవీ హక్కుల కమిటీ (ఎఫ్.ఆర్.సి.) సభ్యులు తమలో నుంచి ఒకరిని ఛైర్‌పర్సన్‌గానూ, మరొకరిని సెక్రటరీగానూ నిర్ణయించుకోవాలి. ఇలా ఎంచుకున్న వాళ్ళ వివరాలను సబ్-డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.ఎల్.డి.సి.)కి పంపించాలి. అటవీ హక్కుల కమిటీ (ఎఫ్.ఆర్.సి.) సభ్యులలో ఎవరైనా వ్యక్తిగత అటవీ హక్కుల (ఐ.ఎఫ్.ఆర్.) కోసం దరఖాస్తు చేస్తే, అతడు/ ఆమె ఆ విషయాన్ని అటవీ హక్కుల కమిటీ (ఎఫ్.ఆర్.సి.) లోని ఇతర సభ్యులకు తెలియ చేయాలి. కమిటీ తన దరఖాస్తును పరిశీలించే క్రమంలో అతడు/ ఆమె ఆ దరఖాస్తు పరిశీలన/ ధృవీకరణ ప్రక్రియలో పాల్గొనకూడదు.

## * అటవీ హక్కుల కమిటీ (ఎఫ్.ఆర్.సి.) విధులు

1. అటవీ హక్కుల చట్టంలోని రూలు 11(2) ప్రకారం, అటవీ హక్కుల కమిటీ (ఎఫ్.ఆర్.సి.) గ్రామ సభకు ఈ కింది అంశాలలో సహకారం అందించాలి.

- నిర్ధారిత నమూనాలలో, తగిన సాక్ష్యాధారాలతో సహా, అటవీ హక్కుల దరఖాస్తులు స్వీకరించడం, వాటిని స్వీకరించినట్టు రసీదులు ఇవ్వడం, పరిశీలన నిమిత్తం వాటిని నిర్వహించడం.
- అటవీ హక్కుల కోసం అందిన దరఖాస్తులు, వాటికి జత చేసిన సాక్ష్యాధారాలు, మ్యాపులకు సంబంధించిన రికార్డులు రూపొందించడం.
- అటవీ హక్కుల కోసం దరఖాస్తులు పెట్టుకున్న వాళ్ళ జాబితా రూపొందించడం.
- ఈ చట్టంలో పొందుపరిచిన అంశాలు/ నియమాలు మేరకు హక్కుల దరఖాస్తులను పరిశీలించడం.
- హక్కుల దరఖాస్తుల స్వభావం, పరిధి వంటి అంశాలపై తాము పరిశీలించి నిర్ధారించి అంశాలను, గ్రామ సభ పరిశీలనకు నివేదించడం.

2. అటవీ హక్కుల కమిటీ తమకు అందిన ప్రతి దరఖాస్తును గుర్తించి, దానికి రాతపూర్వక రసీదు అందించాలి. గ్రామ సభ తరపున సాముదాయిక అటవీ హక్కుల (సి.ఎఫ్.ఆర్.)కు సంబంధించి దరఖాస్తులను ఫారం-బిలో రూపొందించాలి. సాముదాయిక అటవీ వనరుల మీద హక్కుల కోసం, చట్టంలోని సెక్షన్ 3, సబ్ సెక్షన్ (1) క్లాజు (i)లో తెలిపిన మేరకు అనుబంధం-1లో పొందుపరచిన ఫారం-సి నమూనాలో దరఖాస్తులు రూపొందించాలి.

# సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.)

అటవీ హక్కులను ఖరారు చేసి సంబంధిత టైటిల్స్ అందించడం, ఆ హక్కుల రికార్డులు (రికార్డు ఆఫ్ రైట్స్) రూపొందించటం వంటి ప్రక్రియలలో సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.), జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)లకు ముఖ్యమైన పాత్ర ఉంటుంది. అటవీ హక్కులకు సంబంధించి గ్రామసభ ద్వారా అందే సిఫారసులను స్వీకరించి, పరిశీలించడం ఎస్.డి.ఎల్.సి. బాధ్యత. వాటిని పరిశీలించిన తరువాత హక్కుల రికార్డులు (రికార్డు ఆఫ్ రైట్స్) ముసాయిదా రూపొందించాలి. తరువాత వాటిని ఆమోదం కోసం జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)కి పంపాలి.

## * సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.)

సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.)ని రాష్ట్ర ప్రభుత్వం ఈ కింద తెలిపిన సభ్యులతో ఏర్పాటు చేస్తుంది.

- సబ్-డివిజన్ స్థాయి అధికారి లేదా సమాన హోదా కలిగిన అధికారి - చైర్‌పర్సన్.
- సబ్-డివిజన్ ఇంచార్జ్ వున్న అటవీ అధికారి (ఫారెస్టు ఆఫీసర్) లేదా సమాన హోదా కలిగిన అధికారి.
- బ్లాక్ లేదా తహసీల్ స్థాయి పంచాయితీల నుంచి ముగ్గురు సభ్యులు - వీళ్లను జిల్లా పంచాయితీ నామినేట్ చేస్తుంది. (1) వీరిలో కనీసం ఇద్దరు సభ్యులు షెడ్యూల్డ్ జాతులకు (ఎస్.టి.లు) చెందిన వాళ్ళు ఉండాలి. ఆటవీ జాతులు లేదా పి.వి.టి.జి.లకు చెందిన వాళ్ళయితే మంచిది. (2) ఒకవేళ ఆ ప్రాంతంలో షెడ్యూల్డ్ జాతులకు (ఎస్.టి.లు) చెందిన వాళ్ళు లేకపోతే ఆ ఇద్దరు సభ్యులు ఇతర సాంప్రదాయిక అటవీ జాతులకు (ఓ.ఎఫ్.టి.డి.లు) చెందిన వాళ్ళు అయి ఉండాలి. అంతేకాకుండా ఆ ఇద్దరిలో ఒక మహిళ ఉండాలి. (3) రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్డ్‌లో పొందుపరచిన ప్రాంతాల పరిధిలోనైతే స్వయం ప్రతిపత్తి కలిగిన జిల్లాస్థాయి మండలి లేదా ప్రాంతీయ స్థాయి మండలి ఈ ముగ్గురు సభ్యులను నామినేట్ చేయాలి. వాళ్లలో ఒకరు మహిళ ఉండాలి. ఆ సబ్ డివిజన్ ఇంచార్జి ఉండే గిరిజన సంక్షేమ విభాగపు అధికారి లేదా, ఒకవేళ అటువంటి అధికారి లేకపోతే ఆ ఏరియాలోని గిరిజన సంక్షేమ వ్యవహారాలు పర్యవేక్షించే అధికారి.

## * ఎస్.డి.ఎల్.సి. విధులు

1. ఎఫ్.ఆర్.ఏ. చట్టం, సంబంధిత నియమాలలో పొందుపరచిన ఉద్దేశాలు, ప్రక్రియలపై అడవిలో నివాసముండే జాతులకు అవగాహన పెంచడం.
2. గ్రామ సభ లేదా అటవీ హక్కుల కమిటీ కోరే సమాచారం, రికార్డులు అందించడం, అవసరమైనప్పుడు వాటిమీద తలెత్తే సందేహాలను ఒక అధీకృత అధికారి ద్వారా నివృత్తి చేయించడం.
3. గ్రామ సభ లేదా అటవీ హక్కుల కమిటీకి అటవీ మ్యాపులు, రెవెన్యూ మ్యాపులు, ఓటర్ల జాబితా వంటివి అందించడం.
4. గ్రామ సభ సమావేశాలు స్వతంత్రంగా, స్వేచ్ఛగా, పారదర్శకరీతిలో జరిగేలా చూడటం.
5. ఈ చట్టంలోని నియమాల పరిధిలో అనుబంధం-1లో పొందుపరచిన అన్ని దరఖాస్తు ఫారాలు (ఫారం-ఏ, ఫారం-బి & ఫారం-సి) అవసరమైన వాళ్ళందరికి సులువుగా, ఉచితంగా అందుబాటులో ఉండేలా చూడటం.
6. సంబంధిత గ్రామ సభల ద్వారా జరిగే తీర్మానాలను అన్నింటినీ సేకరించి దగ్గర పెట్టుకోవడం.
7. గ్రామ సభలు అందించే మ్యాపులు, ఇతర అన్ని వివరాలను క్రోడీకరించడం.
8. గ్రామ సభలు అందించే మ్యాపులు, తీర్మానాలు అన్నింటినీ పరిశీలించి, ఆయా దరఖాస్తుల ఖచ్చితత్వాన్ని నిర్ధారించడం.
9. అటవీ హక్కుల పరిధి, స్వభావానికి సంబంధించి గ్రామ సభల మధ్య తలెత్తే వివాదాలను విని, పరిష్కరించడం.
10. సబ్ డివిజనల్ స్థాయిల్లో ఉండే అంతర్గత వివాదాలను పరిష్కరించుకోవడానికి తోటి సబ్ డివిజనల్ స్థాయి కమిటీ (ఎస్.డి.ఎల్.సి.)లతో సమన్వయం చేసుకోవడం.
11. ప్రభుత్వ రికార్డులతో సరిపోల్చుకుని ధృవీకరించుకున్న తరువాత ప్రతిపాదిత అటవీ హక్కులకు సంబంధించి బ్లాకు లేదా తహసీల్ వారీగా ముసాయిదా రికార్డులు రూపొందించడం.
12. హక్కుల కోసం అందిన దరఖాస్తులను ప్రతిపాదిత అటవీ హక్కుల ముసాయిదా రికార్డులను, తుది నిర్ణయం కోసం, సబ్ డివిజనల్ స్థాయి అధికారి ద్వారా జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)కి నివేదించడం.

# జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)

అటవీ హక్కుల కోసం అందిన దరఖాస్తుల మీద తుది నిర్ణయం తీసుకునే అధికార యంత్రాంగం ఈ జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.), సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.)లు నివేదించిన ప్రతిపాదిత అటవీ హక్కుల ముసాయిదా రికార్డులను డి.ఎల్.సి. స్వీకరించి, పరిశీలిస్తుంది. దరఖాస్తులను ఆమోదించిన తరువాత, అటవీ హక్కులకు సంబంధించి తుది రికార్డులు (రికార్డు ఆఫ్ రైట్స్) రూపొందిస్తుంది. హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్న కమ్యూనిటీ ప్రజలకు హక్కుల పత్రాలు (టైటిల్స్) పంపిణీ చేస్తుంది.

## * జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) వ్యవస్థాగత నిర్మాణం:

జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)ని రాష్ట్ర ప్రభుత్వం ఈ కింద తెలిపిన సభ్యులతో ఏర్పాటు చేస్తుంది.

1. జిల్లా కలెక్టర్ లేదా డిప్యూటీ కమీషనర్ – చైర్‌పర్సన్
2. సంబంధిత డివిజనల్ స్థాయి అటవీ అధికారి (డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్) లేదా సంబంధిత అటవీ ఉప సంరక్షణ అధికారి (డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు)
3. జిల్లా స్థాయి పంచాయితీ నుంచి ముగ్గురు సభ్యులు – వీళ్ళను జిల్లా పంచాయితీ నామినేట్ చేస్తుంది. (1) వీరిలో కనీసం ఇద్దరు సభ్యులు షెడ్యూల్డ్ జాతులకు (ఎస్.టి.లు) చెందిన వాళ్ళు ఉండాలి. అటవీ జాతులు లేదా పి.వి.టి.జి.లకు చెందిన వాళ్ళయితే మంచిది. (2) ఒకవేళ ఆ ప్రాంతంలో షెడ్యూల్డ్ జాతులకు (ఎస్.టి.లు) చెందిన వాళ్ళు లేకపోతే, ఆ ఇద్దరు సభ్యులు ఇతర సాంప్రదాయిక అటవీ జాతులకు (ఓ.ఎఫ్.టి.డి.లు) చెందిన వాళ్ళు అయి ఉండాలి. అంతేకాకుండా ఆ ఇద్దరిలో ఒక మహిళ ఉండాలి. (3) రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్‌లో పొందుపరచిన ప్రాంతాల పరిధిలోనైతే, స్వయం ప్రతిపత్తి కలిగిన జిల్లా స్థాయి మండలి లేదా ప్రాంతీయ స్థాయి మండలి ఈ ముగ్గురు సభ్యులను నామినేట్ చేయాలి. వాళ్ళలో ఒకరు మహిళ ఉండాలి.
4. ఆ జిల్లాకు ప్రాతినిధ్యం వహించే జిల్లా స్థాయి గిరిజన సంక్షేమ అధికారి లేదా, ఒకవేళ అటువంటి అధికారి లేకపోతే ఆ జిల్లాలో ఏరియాలో గిరిజన సంక్షేమ వ్యవహారాలు పర్యవేక్షించే అధికారి.



గుజరాత్‌లో సాముదాయిక అటవీ హక్కుల అందించే నిమిత్తం జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) సమావేశం

## * జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) విధులు:

1. చట్టంలోని 6వ రూల్, క్లాజు (బి)లో తెలిపిన మేరకు గ్రామ సభ లేదా అటవీ హక్కుల కమిటీ కోరే సమాచారం అందించడం.
2. ఈ చట్టం ఉద్దేశాల మేరకు అన్ని దరఖాస్తులు, ప్రత్యేకించి సాంప్రదాయ గిరిజన తెగలు, పశు పోషక కమ్యూనిటీలకు చెందిన వాళ్ళు, సంచార జాతులకు చెందిన వాళ్ళ దరఖాస్తులు పరిష్కరించబడ్డాయా లేదా అనేది పరిశీలించడం.
3. సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) ద్వారా అందిన దరఖాస్తులు, అటవీ హక్కుల రికార్డులు (రికార్డు ఆఫ్ రైట్స్) పరిశీలించి, తుది ఆమోదం తెలపడం.
4. జిల్లాల స్థాయిలో ఉండే అంతర్గత వివాదాలను పరిష్కరించుకోవడానికి తోటి జిల్లాల అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకోవడం.
5. ఆయా దరఖాస్తుదారులకు అందించిన అటవీ హక్కుల (రికార్డు ఆఫ్ రైట్స్) వివరాలను సంబంధిత ప్రభుత్వ రికార్డులలో నమోదు చేయడానికి అవసరమైన నిర్దేశనలు జారీ చేయడం, ఆ అటవీ హక్కుల రికార్డులు ప్రచురించబడేలా చూడటం.
6. ఈ చట్టంలో పొందుపరచిన అంశాల మేరకు ఈ నియమాలలోని అనుబంధం–2, అనుబంధం–3లో నిర్ధారించిన మేరకు, సంబంధిత దరఖాస్తుదారులకు, సంబంధిత గ్రామ సభకు అధీకృత (సర్టిఫైడ్) వ్యక్తిగత అటవీ హక్కుల రికార్డు, టైటిలు కాపీలు అందేలా చూడటం.
7. ఈ చట్టంలో సెక్షన్ (3), సబ్ సెక్షన్ (1) క్లాజు (i)లో పొందుపరచిన అంశాల మేరకు, ఈ నియమాలలోని అనుబంధం–4లో నిర్ధారించిన మేరకు, సాముదాయిక అటవీ వనరులపై అందించిన హక్కులకు సంబంధించి, అధీకృత (సర్టిఫైడ్) సాముదాయిక అటవీ వనరుల హక్కుల రికార్డు, టైటిల్ కాపీలు సంబంధిత గ్రామ సభకు, సంబంధిత సముదాయానికి (కమ్యూనిటీకి) అందేలా చూడటం.

# రాష్ట్ర స్థాయి పర్యవేక్షక కమిటీ (ఎస్.ఎల్.ఎం.సి.)

రాష్ట్ర స్థాయిలో అటవీ హక్కుల చట్టం (ఎఫ్.ఆర్.ఏ.) అమలు తీరును పర్యవేక్షించడానికి ఏర్పాటైన కమిటీ - రాష్ట్ర స్థాయి పర్యవేక్షక కమిటీ (ఎస్.ఎల్.ఎం.సి.). దీనికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వం వహిస్తారు. గిరిజన సంక్షేమ శాఖ, రెవెన్యూ శాఖ, అటవీ శాఖ, పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శులు, గిరిజన సంక్షేమ సలహా మండలి సభ్యులు ఈ ఎస్.ఎల్.ఎం.సి.లో సభ్యులుగా ఉంటారు.


### * రాష్ట్ర స్థాయి పర్యవేక్షక కమిటీ (ఎస్.ఎల్.ఎం.సి.) వ్యవస్థాగత నిర్మాణం:

1. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి - చైర్‌పర్సన్
2. కార్యదర్శి, రెవెన్యూ శాఖ - సభ్యుడు
3. కార్యదర్శి, గిరిజన లేదా సాంఘిక సంక్షేమ శాఖ - సభ్యుడు
4. కార్యదర్శి, అటవీ శాఖ సభ్యుడు
5. కార్యదర్శి, పంచాయితీరాజ్ శాఖ - సభ్యుడు
6. అటవీ శాఖ ముఖ్య ప్రధాన సంరక్షణ అధికారి - సభ్యుడు
7. గిరిజన సంక్షేమ మండలికి చెందిన ముగ్గురు షెడ్యూల్డ్ జాతుల సభ్యులు. గిరిజన సంక్షేమ మండలి చైర్‌పర్సన్ వీళ్ళను నామినేట్ చేస్తారు. ఒకవేళ గిరిజన సంక్షేమ మండలి లేకపోతే షెడ్యూల్డ్ జాతులకు చెందిన వాళ్ళ నుంచి ముగ్గురు సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేస్తుంది.
8. కమీషనర్, గిరిజన సంక్షేమ శాఖ లేదా సమాన హోదా కలిగిన అధికారి - సభ్య కార్యదర్శిగా ఉంటారు.

### * రాష్ట్ర స్థాయి పర్యవేక్షక కమిటీ (ఎస్.ఎల్.ఎం.సి.) విధులు:

1. అటవీ హక్కుల గుర్తింపు, హక్కులు అందించడం వంటి ప్రక్రియల పర్యవేక్షణకు తగిన ప్రామాణికాలు, సూచికలు రూపొందించడం.
2. రాష్ట్రంలో అటవీ హక్కుల గుర్తింపు, ధృవీకరణ, హక్కులు అందించటం వంటి ప్రక్రియల పర్యవేక్షణ చేపట్టడం.
3. అటవీ హక్కుల గుర్తింపు, ధృవీకరణ, హక్కులు అందించడం వంటి ప్రక్రియల పర్యవేక్షణ కోసం కనీసం మూడు నెలలకు ఒకసారి సమావేశమవ్వడం.
4. అటవీ హక్కుల ధృవీకరణ, హక్కులు అందించడం వంటి ప్రక్రియల పరంగా క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలు/ ఇబ్బందులు గుర్తించడం, వాటిని పరిష్కరించడం.
5. అటవీ హక్కుల దరఖాస్తుల స్థితిగతుల విషయంలో తమ విశ్లేషణ/ మదింపును ఈ చట్టం మేరకు రూపొందించిన నియమాలలో పొందుపరచిన అనుబంధం-5 నమూనాలో ప్రతి మూడు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వానికి త్రైమాసిక నివేదిక పంపడం, అటవీ హక్కుల చట్టంలో నిర్దేశించిన మేరకు రాష్ట్ర స్థాయి అటవీ హక్కుల పర్యవేక్షణ కమిటీ (ఎస్.ఎల్.ఎం.సి.) హక్కుల దరఖాస్తుల వివరాలు, ఆమోదించిన హక్కుల వివరాలు అన్నీ కూడా నివేదిక రూపంలో సమర్పించాలి. ఒకవేళ ఏవైనా దరఖాస్తులు తిరస్కరించబడితే దానికి కారణాలు కూడా ఈ నివేదికలో తెలపాలి. అప్పటికీ ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలు కూడా నివేదికలో పొందుపరచాలి.
6. ఈ చట్టంలోని సెక్షన్ (8) మేరకు అందిన నోటీసుల మేరకు, సంబంధిత అధికారులపై చట్టపరంగా అవసరమైన చర్యలు చేపట్టాలి.
7. ఈ చట్టంలోని సెక్షన్ (4), సబ్ సెక్షన్ (2) మేరకు పునరావాస అంశాలను పర్యవేక్షించాలి.
8. ప్రత్యేకించి ఈ చట్టంలోని సెక్షన్ (3)లోని సబ్ సెక్షన్ (1), సెక్షన్ (4)లోని సబ్ సెక్షన్ (8) క్లాజు (m)లో తెలిపిన అంశాల అమలు తీరును నిర్దిష్టంగా పర్యవేక్షించాలి.

# దరఖాస్తులు చేసే ప్రక్రియ - దరఖాస్తుల పరిశీలన



అటవీ హక్కుల చట్టం పరిధిలో, పశు పోషక సమూహాలకు చెందిన వాళ్ళు అటవీ హక్కుల కోసం దరఖాస్తు చేయడం, వాటి ఆమోదం పొందడానికి దశల వారీ ప్రక్రియలు:

## హక్కుల దరఖాస్తు చేసే ప్రక్రియ

### ప్రక్రియ 01

గ్రామ సభ అటవీ హక్కుల కమిటీని ఏర్పాటు చేసి, అటవీ హక్కుల దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. ఈ ప్రక్రియలో పశు పోషక సమూహాలకు చెందిన వాళ్ళందరికీ తగిన ప్రాతినిధ్యం, భాగస్వామ్యం ఉండేలా గ్రామ సభ ఉండాలి.

### ప్రక్రియ 02

అటవీ హక్కులు కోరుతూ వచ్చిన దరఖాస్తులను అటవీ హక్కుల కమిటీ స్వీకరించి, ఆ మేరకు దరఖాస్తుదారులకు రసీదులు ఇస్తుంది. ఆ దరఖాస్తులు, వాటితోపాటు జత పరిచిన సాక్ష్యాధారాలు అన్నింటి పరిశీలన నిమిత్తం దగ్గర పెట్టుకుంటుంది. ఆ హక్కుల దరఖాస్తులు సమర్పించే ప్రక్రియలో పశు పోషక సమూహాలు తమ జీవాల మేత కోసం వెళ్ళే వలస మార్గాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

### ప్రక్రియ 03

అటవీ హక్కులు కోరుతూ వచ్చిన దరఖాస్తులను సంబంధిత అటవీ హక్కుల కమిటీ, అక్కడి అటవీ, రెవెన్యూ విభాగాల ప్రతినిధులతో కలిసి పరిశీలిస్తుంది. దరఖాస్తుల పరిశీలన జరిగే సమయంలో పశు పోషక సమూహాల సభ్యులు కూడా అక్కడ ఉండేలా అటవీ హక్కుల కమిటీ తగిన చర్యలు తీసుకోవాలి. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో భాగంగా హక్కులు కోరుతున్న ప్రాంతాన్ని గుర్తించి, మ్యాపుగా రూపొందించాల్సి ఉంటుంది.

### ప్రక్రియ 04

అటవీ హక్కుల దరఖాస్తుల స్వభావం, వాటి పరిధికి సంబంధించి అటవీ హక్కుల కమిటీ ఇచ్చిన నివేదిక వివరాలను గ్రామ సభ పరిశీలిస్తుంది. తరువాత ఆ దరఖాస్తులకు సంబంధించి గ్రామ సభ తీర్మానం చేసి, వాటిని సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) పరిశీలనకు పంపుతుంది.

## ప్రక్రియ
## 05

గ్రామ సభ పంపిన హక్కుల దరఖాస్తులను, తీర్మానాలను సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) పరిశీలిస్తుంది. ఆ పరిశీలన తరువాత అటవీ హక్కుల ముసాయిదా (డాఫ్ట్) రికార్డు రూపొందిస్తుంది. దానిని పరిశీలన, ఆమోదం నిమిత్తం జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)కి పంపుతుంది.

## ప్రక్రియ
## 06

అటవీ హక్కులకు సంబంధించి సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) చేసిన సిఫారసులను, సూచనలను జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) పరిశీలించి, అటవీ హక్కుల తుది రికార్డు రూపొందిస్తుంది. ఆ మేరకు అర్హత పొందిన దరఖాస్తుదారులకు అటవీ హక్కుల 'టైటిల్' జారీ చేస్తుంది. పశు పోషక సమూహాలకు చెందిన వాళ్ళు అటవీ హక్కులు కోరుతూ దరఖాస్తు చేసుకునే ప్రక్రియలో వాళ్ళకు సహాయం అందే రీతిలో, సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.), జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)లు క్రియాశీలక పాత్ర పోషించాలి.

## ప్రక్రియ
## 07

ఏ స్థాయిలోనైనా (గ్రామ సభ/ సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ/ జిల్లా స్థాయి కమిటీ), ఏ దశలోనైనా, అటవీ హక్కుల దరఖాస్తులు తిరస్కరించబడితే లేదా వాటికి ఏవైనా మార్పులు చేపడితే, ఆ సమాచారాన్ని సంబంధిత దరఖాస్తుదారులకు రాతపూర్వకంగా తెలియ చేయాలి. ఈ విషయంలో అటవీ హక్కుల దరఖాస్తుదారులకు ఏవైనా సమస్యలు ఉంటే వాటిపై అప్పీల్ చేసుకోవడానికి వీలు కల్పించి అవసరమైన విచారణ చేపట్టాలి.

## జీవాల మేత కోసం పశు పోషక సమూహాలు సంప్రదాయకంగా వలస వెళ్ళే మార్గాలు ఒకవేళ పరిపాలన పరంగానూ, భౌగోళికంగానూ కొన్ని ప్రాంతాల పరిధికి విస్తరించి ఉన్నప్పుడు, ఆ సమూహాలకు చెందిన వాళ్ళు అటవీ హక్కుల కోసం ఎక్కడ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది?

పశు పోషక సమూహాలకు చెందిన వాళ్ళు అటవీ హక్కుల కోసం ఎక్కడ దరఖాస్తు చేయాలనేది వాళ్ళు వలస వెళ్ళే మార్గాలను బట్టి, ఆ ప్రాంతాలలో గ్రామ సభ ఏర్పాటయ్యే తీరు బట్టి కొంత మట్టుకు ఆధారపడి ఉంటుంది. మామూలుగా ఈ పశు పోషక సమూహాలు అటవీ హక్కుల కోసం దరఖాస్తు చేసుకునే ప్రాంతాలు ఈ కింద తెలిపిన మూడు పరిస్థితుల పరిధిలో ఉంటాయి. అలాగని, ఈ మూడు రకాల పరిస్థితులే ఉండాలని కూడా ఏమీ లేదు. ఎప్పుడైనా, ఎక్కడైనా వీటికి కూడా భిన్నమైన పరిస్థితి ఉండవచ్చు.

ఒక జిల్లా హద్దుల లోపల అటవీ హక్కులు కోరే పశు పోషక సమూహాలు మామూలుగా తమ జీవాల మేత కోసం రెండు లేదా మూడు గ్రామ పంచాయితీల పరిధిలో తిరుగుతూ ఉంటారు. ఇటువంటి సందర్భాలలో ఈ పశు పోషక సమూహాలకు చెందిన వాళ్ళు తాము నివాసం ఉండే గ్రామాలలో నిర్వహించే గ్రామ సభలలో అటవీ హక్కుల కోసం దరఖాస్తులు పెట్టవచ్చు. అప్పుడు సంబంధిత జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.), ఆ దరఖాస్తుదారులు తమ జీవాల మేత కోసం వెళ్ళే ఆయా ప్రాంతాల పరిధిలోని గ్రామ సభలలో ఆ దరఖాస్తులు పరిశీలన ప్రక్రియ జరిగేలా చూడాలి (రూల్ 12బి (2)). ఆయా ప్రాంతాలకు చెందిన ఇతర పశు పోషక సమూహాలతోనూ, సంబంధిత గ్రామ సభలతోనూ సంప్రదింపులు జరుపుతూ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ జరపాలి. సబ్ డివిజనల్ ప్రాంత హద్దులలో అటవీ హక్కుల కోసం వచ్చే దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను అక్కడి సంబంధిత సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) అవసరమైన సమన్వయంతో చేపట్టాలి (రూల్ 6 (హెచ్)).

ఒకే జిల్లా హద్దుల లోపల అటవీ హక్కులు కోరే పశు పోషక సమూహాలు మామూలుగా తమ జీవాల మేత కోసం రెండు లేదా మూడు గ్రామ పంచాయితీల పరిధిలో తిరుగుతూ ఉంటారు. ఇటువంటి సందర్భాలలో ఈ పశు పోషక సమూహాలకు చెందిన వాళ్ళు తాము నివాసం ఉండే గ్రామాలలో నిర్వహించే గ్రామ సభలలో అటవీ హక్కుల కోసం దరఖాస్తులు పెట్టవచ్చు.

ఒక రాష్ట్రంలోని విభిన్న జిల్లాలలో మేపే వాళ్ళు దాని కోసం సీజనల్‌గా సంచరించే పశు పోషక సమూహాలు, వాటికి సంబంధించిన అటవీ హక్కుల కోసం, తాము నివాసం ఉండే గ్రామాలలో నిర్వహించే గ్రామ సభలలో హక్కుల దరఖాస్తులు సమర్పించాలి. అప్పుడు సంబంధిత జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.), సంబంధిత గ్రామ సభలలో ఆ దరఖాస్తులు పరిశీలన ప్రక్రియ జరిగేలా చూడాలి (రూల్ 12బి(2)). అంతేకాకుండా ఆ దరఖాస్తులకు సంబంధం ఉన్న ఇతర జిల్లాలోని జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)లతో కూడ సమన్వయం చేసుకోవాలి (రూల్ 8(ఇ)). ఇలాంటి

సందర్భాలలో, ఆయా జిల్లాల జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)లు ఉమ్మడి సమావేశం నిర్వహించుకుని, ఆ అటవీ హక్కుల దరఖాస్తుల పరిశీలించి, హక్కులు కల్పించే ప్రక్రియను చేపట్టవచ్చు. అలాంటప్పుడు అటవీ హక్కుల దరఖాస్తులకు సంబంధించిన గ్రామ సభలు ఏ జిల్లా పరిధిలోకి వస్తాయో, ఆ జిల్లాకు చెందిన జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) ఇలాంటి ఉమ్మడి సమావేశం నిర్వహించే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది.

విభిన్న రాష్ట్రాల హద్దులలో జీవాలను మేపే వాళ్ళు, దాని కోసం సీజనల్‌గా ఆ ప్రాంతాలలో సంచరించే పశు పోషక సమూహాలకు చెందిన వాళ్ళు తాము నివాసం ఉండే గ్రామాలలో జరిగే గ్రామ సభలలో అటవీ హక్కుల కోసం దరఖాస్తులు సమర్పించాలి. ఇలాంటి సందర్భాలలో వాళ్ళు నివాసం ఉండే జిల్లాకు చెందిన సంబంధిత జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.), సంబంధిత గ్రామ సభలలో ఆ దరఖాస్తులు పరిశీలన ప్రక్రియ జరిగేలా చూడాలి (రూల్ 12బి (2)). అంతేకాకుండా ఆ దరఖాస్తులకు సంబంధం ఉన్న ఇతర జిల్లాలోని జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)లతో కూడ సమన్వయం చేసుకోవాలి (రూల్ 8 (ఇ)). ఇలాంటి సందర్భాలలో ఆయా జిల్లాల స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)లు ఉమ్మడి సమావేశం నిర్వహించుకుని, ఆ అటవీ హక్కుల దరఖాస్తుల పరిశీలించి, హక్కులు కల్పించే ప్రక్రియను చేపట్టవచ్చు.

ఇలాంటి సందర్భంలో హక్కుల దరఖాస్తుల పరిధి కొన్ని రాష్ట్రాలకు విస్తరించి ఉంటుంది. కాబట్టి డి.ఎల్.సి. అవసరమైన మేరకు రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కమిటీ (ఎస్.ఎల్.ఎం.సి.) సహాయం కోరవచ్చు. అప్పుడు ఆ రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కమిటీ (ఎస్.ఎల్.ఎం.సి.) సంబంధిత రాష్ట్రాల ఎస్.ఎల్.ఎం.సి.లతో సమన్వయం చేసుకుని, అంతర రాష్ట్ర హద్దుల పరిధిలోని ఆ హక్కుల దరఖాస్తులను పరిష్కరించాలి.

## సాక్ష్యాధారాలు

అటవీ హక్కుల దరఖాస్తుల ప్రక్రియలో ఏయే రకాల సాక్ష్యాధారాలు సమర్పించాలి అనేది ఈ చట్టంలోని సెక్షన్ 13లోని నియమాలలో స్పష్టంగా చెప్పారు. వాటిలో కొన్ని ప్రధానమైన సాక్ష్యాధారాలు ఈ కింద తెలుపబడ్డాయి. పశు పోషక సమూహాలకు సంబంధించినంత వరకు ఇవి చాలా ముఖ్యమైనవి:

ఎ) ప్రభుత్వ రికార్డులు (అధికారిక గెజిట్‌లు, ఆచరణాత్మక ప్రణాళికలు), పశు పోషక సమూహాల వద్ద ఉండే రికార్డులు (ఉదాహరణకు, అటవీ హక్కుల చట్టంలోని సెక్షన్ 13 (2) (ఎ) పరిధిలో జీవాలను మేపడానికి పొందిన అనుమతులు, ఇస్టార్ హక్కులు వంటివి), ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థల నివేదికలు, మ్యాపులు, పశు పోషక సమూహాలు అటవీ భూమిని మేతకు వినియోగించుకోవడం, సాంప్రదాయకంగా వాళ్ళకున్న వనరుల అందుబాటుకు సంబంధించిన సమాచారం, సంబంధిత గణన వివరాలు.

బి) సమూహాలు/ కమ్యూనిటీ పెద్దలు అందించే సమాచారం – సెక్షన్ 13 (1) (ఐ)

సి) భౌతిక సాక్ష్యాలు – ఉదాహరణకు చట్టంలోని సెక్షన్ 13 (2) (బి)లో తెలిపినవి – 'సాంప్రదాయ మేత వనరులు/ పచ్చిక ప్రాంతాలు, మనుషులకు, పశు జీవాలకు నీటి వనరులు, వంటివి'

డి) పాత భూ రికార్డులలో పేర్కొన్న మేరకు వ్యక్తుల వారసత్వ వివరాలు లేదా అంతకుముందు కాలంలో ఫలానా గ్రామంలో చట్టబద్ధంగా నివాసమున్నట్టు ధృవీకరించే గుర్తింపు వివరాలు – సెక్షన్ 13 (హెచ్)

కొన్ని నమూనా సాక్ష్యాధారాలు ఈ కింద ఇవ్వబడ్డాయి:

- ఆచరణాత్మక ప్రణాళికలు
- జీవాల మేత కోసం చెల్లించిన పన్ను రసీదులు
- సంస్థానాధీశులు ఇచ్చిన పత్రాలు
- బి.సి.పి.లు



THE

WORKING PLAN

FOR THE

SAHARANPUR FOREST DIVISION

WESTERN CIRCLE, U. P.

1959-60 to 1963-64

COMPILED IN THE WORKING PLANS CIRCLE

BY

C. B. SINGH

*Deputy Conservator of Forests, Uttar Pradesh*


UNDER THE DIRECTION OF

S. M. SULTAN

*Conservator of Forests, Working Plans and Research Circle,*
*Uttar Pradesh.*

ALLAHABAD:

సహరాన్ పూర్ ఫారెస్ట్ డివిజన్ వర్కింగ్ ప్లాన్ డాక్యుమెంట్ కవర్ పేజి, 1959, 60 – 1963.64




INTRODUCTION


S. M. SULTAN,

*Conservator of Forests,*
*Working Plans Circle,*
*Uttar Pradesh.*

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జాతి పశు పోషకులకు అక్కడి అటవీ వనరులు వినియోగించుకునే హక్కు ఉన్నదని పేర్కొంటూ
అటవీ విభాగం రూపొందించిన వర్కింగ్ ప్లానులోని పేజీలు




జీవాల మేపకం పన్ను రసీదు, 1961, కచ్





స్థానిక సంస్థానాధీశులు ఇచ్చిన లెటర్, 1856, కచ్ –బన్నీ (గుజరాత్). అక్కడి నీటి వనరులు, మేత వనరులపై విభిన్న పశు పోషక కమ్యూనిటీల మధ్య వివాదాలు ఉండేవి. అప్పుడు ఆ వివాదాలను తీర్చడానికి ఆయా కమ్యూనిటీలకు ప్రాంతాలను నిర్దేశిస్తూ స్థానిక సంస్థానాధీశులు ఇచ్చిన లెటర్ ఇది.

## పశు పోషక సమూహాల వలస తీరుతెన్నులు




రాష్ట్రం లోపల




రాష్ట్రం దాటి




జిల్లా లోపల










భాగస్వామ్య పద్ధతుల ద్వారా పశు పోషక కమ్యూనిటీలను డాక్యుమెంట్ చేసే బయో కల్చరల్ కమ్యూనిటీ ప్రోటోకాల్ (బి.సి.పి.) నుంచి తీసుకున్న కొన్ని కవర్ ఇమేజీల సమాహారం

## మ్యాపింగ్


అటవీ హక్కుల దరఖాస్తులకు సంబంధించిన ప్రాంత పరిధిని గుర్తిస్తూ సంబంధిత అటవీ హక్కుల కమిటీ మ్యాపులను రూపొందించాల్సి ఉంటుంది. అది ఒక మామూలు స్కెచ్ మ్యాపు కావచ్చు లేదా గుర్తించదగిన సంకేతాలతో చూపిన సాముదాయిక అటవీ వనరుల డిజిటల్ మ్యాపు కావచ్చు.


కొన్ని నమూనా మ్యాపులు ఈ కింద పేర్కొనబడ్డాయి:

- స్కెచ్ మ్యాపు (చేతితో గీసింది)
- డిజిటల్ మ్యాపు




అటవీ హక్కుల దరఖాస్తు ప్రక్రియలో వాడుకోవడానికి ఉపయోగపడే ఒక నమూనా స్కెచ్ మ్యాపు




అటవీ హక్కుల దరఖాస్తు ప్రక్రియలో వాడుకోవడానికి ఉపయోగపడే డిజిటలైజ్డ్ రూట్, మేత ప్రాంతాల మ్యాపింగ్ నమూనాలు
(హిమాచల్‌ప్రదేశ్ & బన్నీ, గుజరాత్ నుంచి)

# ఫిర్యాదులు - అప్పీళ్ళు



అటవీ హక్కుల కోసం పెట్టుకున్న
దరఖాస్తు ఏ స్థాయిలోనైనా, ఏ దశలోనైనా
తిరస్కరించబడినా, లేదా
ఏమైనా మార్పులు చేసినా, వాటిపై ఫిర్యాదులు
లేదా అప్పీళ్ళు చేయడానికి
అనేక రకాల వేదికలు ఉన్నాయి

# ఫిర్యాదులు - అప్పీళ్ళు

1. దరఖాస్తుల తిరస్కారం లేదా ఏవైనా మార్పులు చేయడానికి సంబంధించిన సమాచారాన్ని, అట్టి తిరస్కారం/ మార్పులకు కారణాల పూర్తి వివరాలతో, సంబంధిత దరఖాస్తుదారుడు/ గ్రామ సభకు తెలపాలి (60 రోజుల లోపల ఇది జరగాలి, ఈ గడువు గరిష్ఠంగా 90 రోజులు)
2. అధీకృత అధికార వ్యవస్థలకు (అంటే, గ్రామ సభ, సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ లేదా జిల్లా స్థాయి కమిటీ) తప్ప, మరే ఇతర కమిటీకి కానీ లేదా ఏ వ్యక్తిగత అధికారికి కానీ అటవీ హక్కుల దరఖాస్తులను తిరస్కరించడం, సవరించడం/మార్పులు చేయడం లేదా వాటి హక్కులు నిర్ణయించే అధికారం కానీ లేదు.
3. హక్కుల దరఖాస్తుకు సంబంధించి తన దరఖాస్తును బలపరిచే సమాచారం ఏదైనా ఇవ్వడానికి దరఖాస్తుదారునికి తగిన అవకాశం కల్పించాలి. అలాంటి అవకాశం కల్పించకుండా ఆ బాధిత వ్యక్తి దరఖాస్తును పూర్తిగా తిరస్కరించకూడదు.
4. కేవలం ఏవైనా సాంకేతిక కారణం లేదా ప్రక్రియల పరంగా ఏదైనా లోపం సాకుగా చూపి హక్కుల దరఖాస్తును తిరస్కరించకూడదు లేదా దరఖాస్తులో మార్పులు చేయకూడదు. ఇలాంటి వాటికి ఉదాహరణలు ఈ కింద తెలిపిన కొన్ని కావచ్చు.

* సమాచారం పూర్తిగా లేని దరఖాస్తులు
* సాక్ష్యాధార పత్రాలు లేని దరఖాస్తులు
* మ్యాపులు లేని దరఖాస్తులు
* ధృవీకరణ పూర్తికాని దరఖాస్తులు – ఇతర అంశాలు

5. అటవీ హక్కుల దరఖాస్తుల విషయంలో గ్రామ సభ చేసిన సిఫార్సులు అసంపూర్ణంగా ఉన్నట్టు కానీ లేదా ఇంకా అదనపు పరిశీలన అవసరమని కానీ భావించినప్పుడు, సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) లేదా జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.), ఆ దరఖాస్తును పూర్తిగా తిరస్కరించకుండా లేదా మార్పులు చేయకుండా, అట్టి దరఖాస్తులను పునః పరిశీలించమని సంబంధిత గ్రామ సభలకు అవసరమైన నిర్దేశనలు జారీ చేయవచ్చు
6. గ్రామ సభ చేసిన తీర్మానాన్ని సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) ఆమోదించి, జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) ఆమోదించకపోతే, అట్టి ఆదేశాలు/ నిర్ణయాలు, వాటికి తగిన కారణాలు తెలుపుతూ ఆదేశాల కాపీని హక్కుల దరఖాస్తుదారునికి లేదా సంబంధిత గ్రామ సభకు లేదా సంబంధిత సమూహానికి అందించాలి.
7. సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) కానీ లేదా జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) కానీ, ఫలానా రూపంలోనే సాక్ష్యాధారాలను సమర్పించాలని ఒత్తిడి పెట్టకూడదు.
8. హక్కుల కోసం తాము పెట్టుకున్న దరఖాస్తుల విషయంలో అధికారులు తీసుకున్న ఏ నిర్ణయం మీదనైనా, అట్టి నిర్ణయం తీసుకున్న 60 రోజుల లోపల అధీకృత అధికారులకు అప్పీల్ చేసుకున్న హక్కు దరఖాస్తుదారులకు ఉంది (సెక్షన్ 12 ఎ (3) & సెక్షన్ 6 (2) & సెక్షన్ 6 (4))
9. బాధిత దరఖాస్తుదారులకు తమ వాదనను బలపర్చుకునేందుకు తగిన అవకాశం ఇవ్వకుండా వాళ్ళ అప్పీల్ పిటిషన్లను తిరస్కరించకూడదు (సెక్షన్ 6 (2) & సెక్షన్ 6 (4))
10. బాధిత దరఖాస్తుదారులు చేసుకునే అప్పీల్ మీద విచారణ ఆ దరఖాస్తుదారుల గ్రామాలలో (గ్రామ సభ) అందరికీ సానుకూలమైన ప్రదేశంలో జరగాలి. అట్టి విచారణ జరిగే తేదిని 15 రోజుల ముందే ఆ దరఖాస్తుదారులకు తెలియ చేయాలి. (రూల్ 14 (2) & రూల్ 15 (2))
11. హక్కులు కోరే ఏ దరఖాస్తుదారుడు/ సమూహం అయినా దానికి సంబంధించి గ్రామ సభ చేసిన తీర్మానానికి వ్యతిరేకంగా నేరుగా జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)కి అప్పీల్ పిటిషన్ వేయకూడదు. ముందుగా సంబంధిత సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎష్.డి.ఎల్.సి.)కి అప్పీల్ చేసుకోవాలి. అక్కడ పరిశీలన పూర్తయిన తరువాతనే జిల్లాస్థాయి కమిటీ (డి.ఎల్.సి.)కి వెళ్ళాలి (చట్టంలోని సెక్షన్ 6 (4))

# అప్పీల్ ప్రక్రియలో అధికారుల కీలక విధులు

## * గ్రామ సభ స్థాయిలో

హక్కుల దరఖాస్తులపై తమ నివేదిక వివరాలను గ్రామ సభకు సమర్పించే ముందు, అటవీ హక్కుల కమిటీ, తాము ఆ దరఖాస్తులపై తీసుకున్న నిర్ణయాలను, వాటిని తిరస్కరిస్తే లేదా మార్పులు చేస్తే దానికి గల కారణాలను సదరు దరఖాస్తుదారులకు తెలియ చేయాలి. తన దరఖాస్తు తిరస్కరించబడిందని తెలిసినప్పుడు, ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా గ్రామ సభలో అటవీ హక్కుల కమిటీ ముందు ఆమె/అతడు తన వాదన వినిపించడానికి అప్పీల్ చేసుకోవచ్చు.

దరఖాస్తుదారుడు (అతడు/ఆమె) చేసుకునే అట్టి అప్పీల్‌ను గ్రామ సభ ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చు.

ఒకవేళ అప్పీల్‌ను తిరస్కరిస్తే, దానికి కారణాలను గ్రామ సభ సదరు దరఖాస్తుదారులకు తెలియ చేయాలి. అదే క్రమంలో గ్రామ సభ తీసుకున్న ఈ నిర్ణయం మీద కూడా, తనకు ఆ నిర్ణయం తెలిసిన రోజు నుండి 60 రోజుల లోపల సంబంధిత సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.)కి అప్పీల్ చేసుకునే హక్కు ఉన్నదనే విషయం ఆ దరఖాస్తుదారులకు తెలియ చేయాలి.

## * సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) స్థాయిలో

హక్కులు కోరుతూ తాను పెట్టుకున్న దరఖాస్తుపై గ్రామ సభ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా బాధిత వ్యక్తి లేదా దరఖాస్తుదారు చేసుకునే అప్పీల్ విచారణ ప్రక్రియ తీరును రూల్ 14 వివరిస్తుంది. ఈ ప్రక్రియ, విచారణ రెండు రకాలుగా జరగవచ్చు. ఒకటి – సంబంధిత సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) నేరుగా దానిపై విచారణ నిర్వహించడం, రెండు–అప్పీల్ పిటిషన్‌ను పునః పరిశీలించాలని కోరుతూ దానిని గ్రామ సభకు తిరిగి పంపడం.

మొదటి సందర్భం – అంటే, దరఖాస్తుదారుల అప్పీల్ మీద సంబంధిత సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) నేరుగా విచారణ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నప్పుడు, ఆ పిటిషన్ విచారణ కోసం ముందుగా ఒక తేదీని సబ్ డివిజన్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) నిర్ణయించాలి. అట్టి విచారణ తేది వివరాలను కనీసం 15 రోజుల ముందు సంబంధిత దరఖాస్తుదారులకు, గ్రామ సభకు పబ్లిక్ నోటీసు ద్వారా తెలియ చేయాలి.

గ్రామంలో దరఖాస్తుదారులకు సానుకూలంగా ఉన్న ప్రదేశంలో ఆ విచారణ నిర్వహించాలి. ఉభయ పక్షాల (దరఖాస్తుదారులు & గ్రామ సభ తరఫున అటవీ హక్కుల కమిటీ) వాదనలను సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) వినాలి. ఇట్టి వాదనలు పూర్తయిన పిదప, సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) ఆ అప్పీల్ పిటిషన్‌ను ఆమోదిస్తూ కానీ లేదా తిరస్కరిస్తూ కానీ తగిన ఆదేశాలు జారీ చేయాలి. అట్టి ఆదేశాలను ఉభయ పక్షాలకు రాత పూర్వకంగా అందించాలి. అదే క్రమంలో తాము ఇచ్చిన ఈ ఆదేశాల మీద కూడా, ఆ ఆదేశాలు అందుకున్న 60 రోజుల లోపల సంబంధిత జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)కి అప్పీల్ చేసుకునే హక్కు ఉన్నదనే విషయాన్ని ఉభయ పక్షాలకు తెలియ చేయాలి.

ఇక రెండవ సందర్భం – అప్పీల్ పిటిషన్‌ను పునః పరిశీలించాలని కోరుతూ సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) దానిని గ్రామ సభకు తిరిగి పంపినప్పుడు, అట్టి సమాచారాన్ని ఆ దరఖాస్తుదారునికి తప్పకుండా తెలియ చేయాలి. సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) నుండి ఆ పునః పరిశీలన నిర్దేశనలను అందుకున్న 30 రోజుల లోపల గ్రామ సభ సమావేశం నిర్వహించి, దరఖాస్తుదారు వాదనలు వినాలి. ఇట్టి సమావేశంలో పునః పరిశీలన విచారణ జరిగే తేదీ, స్థల వివరాలను సంబంధిత అటవీ హక్కుల కమిటీ ముందుగానే ఆ దరఖాస్తుదారుడికి తెలియ చేయాలి. తగినంత కోరం (సభ్యుల)తో ఈ గ్రామ సభ సమావేశం స్వతంత్రంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేలా చూసే బాధ్యత ఆ సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.)దే. గ్రామ సభ సభ్యులలో కనీసం సగం మంది (50 శాతం) ఆ గ్రామ సభ సమావేశానికి హాజరయ్యేలా చూడాలి. ఈ సమావేశానికి అదే కోరం. అందులో మూడింట ఒక వంతు (1/3 వంతు) మంది

మహిళలు ఉండాలి. ఈ రీతిలో గ్రామ సభ సమావేశం నిర్వహించి, దరఖాస్తుదారుల వాదనలు విన్న తరువాత, ఆ అంశంపై గ్రామ సభ తీర్మానం చేయాలి. ఆ తీర్మానాన్ని సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.)కి పంపాలి. పునః పరిశీలన తరువాత గ్రామ సభ పంపిన తీర్మానాన్ని సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) పరిశీలించి, తదనుగుణంగా అప్పీల్ పిటిషన్‌ను ఆమోదిస్తూ కానీ లేదా తిరస్కరిస్తూ కానీ ఆదేశాలు జారీ చేయాలి. ఆ ఆదేశాలను సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) రాత పూర్వకంగా ఉభయ పక్షాలకు అంద చేయాలి. అదే క్రమంలో తాము ఇచ్చిన ఈ ఆదేశాల మీద కూడా ఆ ఆదేశాలు అందుకున్న 60 రోజుల లోపల సంబంధిత జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)కి అప్పీల్ చేసుకునే హక్కు ఉన్నదనే విషయాన్ని ఉభయ పక్షాలకు తెలియ చేయాలి.


### * జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) స్థాయిలో

హక్కులు కోరుతూ తాను పెట్టుకున్న దరఖాస్తుపై సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా బాధిత వ్యక్తి లేదా దరఖాస్తుదారు చేసుకునే అప్పీల్ విచారణ ప్రక్రియ తీరును రూలు 15 వివరిస్తుంది. ఈ ప్రక్రియ విచారణ రెండు రకాలుగా జరగవచ్చు – ఒకటి – సంబంధిత జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) నేరుగా దానిపై విచారణ నిర్వహించడం, రెండు – అప్పీల్ పిటిషన్‌ను పునః పరిశీలించాలని కోరుతూ దానిని సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.)కి తిరిగి పంపడం.

మొదటి సందర్భం – అంటే, దరఖాస్తుదారుల అప్పీల్ మీద సంబంధిత జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) నేరుగా విచారణ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నప్పుడు ఆ పిటిషన్ విచారణ కోసం ముందుగా ఒక తేదీని ఆ డి.ఎల్.సి.నిర్ణయించాలి. అట్టి విచారణ తేది వివరాలను కనీసం 15 రోజుల ముందు సంబంధిత దరఖాస్తుదారులకు, సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.)కి పబ్లిక్ నోటీసు ద్వారా తెలియ చేయాలి. గ్రామంలో దరఖాస్తుదారులకు సానుకూలంగా ఉన్న ప్రదేశంలో ఆ విచారణ నిర్వహించాలి. ఉభయ పక్షాల (దరఖాస్తుదారులు & సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ) వాదనలను సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.సి.ఎల్.) వినాలి. ఇట్టి వాదనలు పూర్తయిన పిదప, జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.), ఆ అప్పీల్ పిటిషన్‌ను ఆమోదిస్తూ కానీ లేదా తిరస్కరిస్తూ కానీ తగిన ఆదేశాలు జారీ చేయాలి. అట్టి ఆదేశాలను ఉభయ పక్షాలకు రాత పూర్వకంగా అందించాలి.

ఇక రెండవ సందర్భం – అప్పీల్ పిటిషన్‌ను పునః పరిశీలించాలని కోరుతూ జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) దానిని సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.)కి తిరిగి పంపినప్పుడు, అట్టి సమాచారాన్ని ఆ దరఖాస్తుదారునికి తప్పకుండా తెలియ చేయాలి. జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) నుండి ఆ పునః పరిశీలన నిర్దేశనలను అందుకున్న తరువాత, సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) ఆ సమాచారాన్ని దరఖాస్తుదారులకు, గ్రామ సభకు తెలపాలి. పునః పరిశీలన విచారణ జరిగే తేది, స్థల వివరాలను కూడా తెలియ చేయాలి. పునః పరిశీలన విచారణ జరిగేటప్పుడు సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) ఉభయ పక్షాల (అంటే– గ్రామ సభ, దరఖాస్తుదారు) వాదనలు వినాలి. తరువాత సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) తగు నిర్ణయం తీసుకుని, ఆ నిర్ణయాన్ని జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)కి తెలియ చేయాలి. అప్పుడు సబ్ డివిజనల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) తీసుకున్న నిర్ణయాన్ని జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) పరిశీలించి, తదనుగుణంగా అప్పీల్ పిటిషన్‌ను ఆమోదిస్తూ కానీ లేదా తిరస్కరిస్తూ కానీ ఆదేశాలు జారీ చేయాలి. ఆ ఆదేశాలను రాత పూర్వకంగా ఉభయ పక్షాలకు అంద చేయాలి.

# కేస్ స్టడీలు - నేర్చుకునే అంశాలు



అటవీ హక్కుల చట్టంలోని అంశాలను విజయవంతంగా వినియోగించుకుని, పశు పోషక సమూహాలు తమ జీవాలను మేపే వనరులపై అటవీ హక్కులు పొందిన అనుభవాలకు రెండు ఉదాహరణలు ఇక్కడ ఇస్తున్నాం:

## కేస్ స్టడీ 1

## దేశంలో అటవీ హక్కుల చట్టంలోని అంశాలను ఉపయోగించుకుని తొలిసారిగా సాముదాయిక అటవీ వనరుల హక్కుల (సి.ఎఫ్.ఆర్.)ను పొందిన పశు పోషక సమూహం– గుజరాత్‌లోని కచ్ జిల్లా పరిధిలోని 'బన్నీ గ్రాస్ లాండ్'కు చెందిన మాల్ధారీలు (అడవి మీద ఆధారపడి జీవించే పశు పోషకులు)

### * నేపథ్యం

బన్నీ ప్రాంతం 2500 కిలోమీటర్ల విస్తీర్ణమున్న పెద్ద పచ్చిక బయటు. దీనికి రక్షిత అటవీ ప్రాంతంగా వర్గీకరించారు. ఈ మేత ప్రాంతాన్ని మాల్ధారీ తెగకు చెందిన పశు పోషక సమూహాలు ఎన్నో ఏళ్ళుగా సాంప్రదాయకంగా వినియోగించుకుంటూ, కాపాడుకుంటూ నిర్వహిస్తున్నారు. వీళ్ళలో కొందరు పూర్తి స్థాయిలో సంచారులు/కొంతమంది పాక్షిక సంచారులు. మొత్తం కలిపి అక్కడ 7000 కుటుంబాలు ఉన్నాయి. ఎక్కువ మంది మాల్ధారీలే. 'బన్నీ', 'కంకేరీ' వంటి స్థానిక జాతులకు చెందిన వాళ్లు కూడా పశు జీవాలను పెంచుకుంటూ, ఆ పచ్చిక బయలు ప్రాంతం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పరిపాలన పరంగా చూస్తే, ఈ ప్రాంతం అంతా 19 పంచాయితీలకు చెందిన 48 గ్రామాల పరిధిలో విస్తరించి ఉంది. అయితే బన్నీ పచ్చిక బయలు ప్రాంతంలో ఎప్పుడు కూడా అంతర్గత హద్దులు లేవు. వనరుల అందుబాటు, వాటి వినియోగం విషయంలో ఆ ప్రాంతాన్ని అక్కడి వారందరూ ఏ హద్దులు లేకుండా వాడుకుంటారు.

### * అవగాహన - సామాజిక సమీకరణ

బన్నీ ప్రాంతం మీద హక్కుల కోసం బన్నీ బ్రీడర్స్ అసోసియేషన్ (బి.పి.యు.ఎం.ఎస్.–బన్నీ పశు ఉచ్చారక్ మాల్ధారీ సంఘటన్) 2011 సంవత్సరం నుంచి ప్రభుత్వంతో చర్చలు మొదలు పెట్టింది. చాలాసార్లు చర్చలు, అవగాహన కార్యక్రమాలు జరిగిన తరువాత మాల్ధారీలు ఒక నిర్ణయానికి వచ్చారు. బన్నీ పచ్చిక బయలు ప్రాంతాన్ని ఒక ఉమ్మడి వనరుగా అందరూ వాడుకోవాలని, దానికోసం సాముదాయిక అటవీ వనరుల హక్కుల కోసం ప్రయత్నం చేయాలన్నదే వాళ్ళ నిర్ణయం. నిజానికి అంత పెద్ద సంఖ్యలో జనం అంతా ఒక్కటై, విశాలమైన భూ వనరు మీద హక్కులు కోరడం అనేది దేశంలో అదే తొలిసారి. 2012లో వాళ్ళంతా ఒక పెద్ద ర్యాలీ నిర్వహించారు. అటవీ హక్కుల చట్టం అమలు చేయాలని, ఆ చట్టం ప్రకారం బన్నీ పచ్చిక బయలు ప్రాంతంపై తమకు అధికారికంగా సాంప్రదాయిక అటవీ హక్కులు కల్పించాలన్నది ఆ ర్యాలీలో వాళ్ళ ప్రధాన డిమాండు.

### * గ్రామ సభ & అటవీ హక్కుల కమిటీ ఏర్పాటు

అటవీ హక్కుల చట్టం ప్రకారం అక్కడ గ్రామ సభలు నిర్వహించి, ఆ చట్టంలో పొందుపరచిన అంశాల పరిధిలో హక్కుల దరఖాస్తులు సమర్పించడానికి అటవీ హక్కులు కమిటీ (ఎఫ్.ఆర్.సి.)లను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. 2012లో ఒక భారీ ర్యాలీ నిర్వహించారు. ఆ ప్రాంతంలో అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నవంబరు 2013లో గ్రామ స్థాయిలో అనేక రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హక్కుల మీద అవగాహన పెంచుకున్నారు. బన్నీ ప్రాంతాన్ని సాముదాయిక అటవీ వనరులుగా వాడుకుంటామని చెబుతూ, ఆ మేరకు సాముదాయిక అటవీ హక్కులు కల్పించాలని కోరారు.

గ్రామ స్థాయిలలో జరిగిన గ్రామ సభలలో అటవీ హక్కుల కమిటీ (ఎఫ్.ఆర్.సి.)లు ఏర్పాటు చేసుకోవడం మొదలు పెట్టారు. ఆ క్రమంలో 48 గ్రామాలలో అటవీ హక్కుల కమిటీలు ఏర్పాటయ్యాయి. ఈ కమిటీల ద్వారా గ్రామ సభలు



ఫోటో క్రెడిట్: సహజీవన్ సాముదాయిక అటవీ హక్కులు చర్చిస్తున్న ఒక గ్రామ సభ సమావేశం

చేసిన తీర్మానాలను సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.), జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)లకు పంపించారు. అంతకు ముందే కమ్యూనిటీ స్థాయిలోనూ, జిల్లా అధికార యంత్రాంగం స్థాయిలోనూ పలు దఫాలు చర్చలు జరిగాయి. స్థానికంగా ఉండే జనాభాలో మాల్ధారీ తెగకు చెందిన వాళ్ళే ఎక్కువ కావడం వల్ల అక్కడ చాలా మట్టుకు ఏక జాతి స్వభావం కలిగిన గ్రామ సభలు, అటవీ హక్కుల కమిటీ (ఎఫ్.ఆర్.సి.)లు ఏర్పాటయ్యాయి.

దాదాపుగా అన్ని ఆవాస ప్రాంతాలలోనూ గ్రామ సభల నిర్వహణ ప్రక్రియ ఒకే తీరుగా ఉండటం, ఈ ఆవాస ప్రాంతాలు అన్నీ కూడా ఆ విశాల ప్రాంతంలో అక్కడక్కడ విస్తరించి ఉండటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, ఆ గ్రామ సభలన్నీ కలిసి ఒక 'మహా గ్రామ సభ' (గ్రామ సభల సమాఖ్య)గా ఏర్పడాలని నిర్ణయించుకున్నాయి. దీనివల్ల సమన్వయం, సంప్రదింపుల ప్రక్రియ సులువవుతుందని భావించారు. అటవీ హక్కుల దరఖాస్తు, హక్కుల గుర్తింపు పొందటం వంటి ప్రక్రియలు అన్నీ కూడా ఈ 'మహా గ్రామ సభ' గొడుగు కింద జరిగాయి.

## * హక్కులకు దరఖాస్తులు సమర్పించడం

అక్కడ గ్రామ సభలు, అటవీ హక్కుల కమిటీలు చేసిన మొట్టమొదటి పని – తమకున్న హక్కుల నిర్ధారణ, వనరుల మ్యాపింగ్, వనరుల అందుబాటు, వినియోగంలో చొరబాట్లు వంటి అంశాలను స్పష్టంగా గుర్తించడం. వనరుల మ్యాపింగ్ కోసం అటవీ హక్కుల కమిటీలు అక్కడ పనిచేస్తున్న 'సహజీవన్' అనే స్వచ్ఛంద సంస్థ సేవలను తీసుకున్నారు. అనేక బృందాలతో గ్రామ స్థాయిలో అనేక సార్లు చర్చలు జరిగాయి. సీజనల్ వారీగా విభిన్న మేత ప్రాంతాల అందుబాటు ప్రాతిపదికన వనరుల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసుకున్నారు.

ఈ మధ్య కాలంలోనే ఆ అటవీ హక్కుల కమిటీలను అధికారికంగా ఏర్పాటు చేయమని జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. ఆ ప్రక్రియ పూర్తి చేసుకుని, 2014 నుంచి వాటి ద్వారా అటవీ హక్కుల చట్టం పరిధిలో అటవీ హక్కులు కోరుతూ దరఖాస్తులు రూపొందించి, అధికార యంత్రాంగానికి సమర్పించారు.



అటవీ హక్కుల చట్టం అందించే హక్కులు, ప్రయోజనాలపై చర్చ కోసం మహిళల సమావేశం


అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు కలిసి, హక్కుల దరఖాస్తు ప్రక్రియ ఎలా ఉండాలనేది నిర్ణయించుకున్నారు. మొత్తం బన్నీ ప్రాంతానికి అంతా కలిపి ఒకే హక్కుల దరఖాస్తు చేయాలా లేక విడివిడిగా దరఖాస్తులు సమర్పించాలా అనేది తమలో తాము చర్చించుకున్నారు. ఇలా ఎన్నో చర్చలు జరిగిన పిదప ప్రతి గ్రామ సభ విడిగానే సాముదాయిక అటవీ వనరులపై హక్కుల దరఖాస్తు సమర్పించాలని తీర్మానించుకున్నారు. అయితే ఆయా గ్రామ సభలు చేసే దరఖాస్తులకు ఒకే తరహా ఫార్మాట్ రూపొందించుకున్నారు. డిమాండ్ కూడా ఒకేరకంగా చేయాలని అనుకున్నారు. అయితే ఇవన్నీ కూడా 'మహా గ్రామ సభ' ద్వారానే వెళ్ళాలని కూడా నిర్ణయించుకున్నారు. అన్ని గ్రామ సభలలోనూ, మహా గ్రామ సభలోనూ, హక్కుల దరఖాస్తుల ఆమోదం తీసుకుని, వాటిని సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.)కి నివేదించారు. ఈ రకంగా మొత్తంగా 48 హక్కుల దరఖాస్తులను ఆయా గ్రామ సభలు, మహా గ్రామ సభ ఆమోదించి ఎస్.డి.ఎల్.సి.కి పంపాయి.

### * అటవీ హక్కుల చట్టం పరిధిలో గ్రామ సభలు కోరిన అటవీ హక్కులు:

1. అటవీ హక్కు చట్టం (ఎఫ్.ఆర్.ఎ.) సెక్షన్ (3) (1) (బి) కింద ఇస్తార్ హక్కులు: బన్నీ పచ్చిక బయలు ప్రాంతంలో ఆవాస హక్కులు, జీవాలను మేపే హక్కులు, నీటి వనరులపై హక్కులు, జీవనోపాధుల పెంపు కోసం అక్కడ ఉన్న సహజ వనరులపై హక్కులు
2. అటవీ హక్కుల చట్టం (ఎఫ్.ఆర్.ఎ) సెక్షన్ (3) (1) (సి) కింద కలపేతర అటవీ ఉత్పత్తుల (ఎన్.టి.ఎఫ్.పి.)పై హక్కులు: కరవు పరిస్థితులలో – తేనె, గమ్, పశు గ్రాసం, ఔషధ మొక్కలు, వంట చెరకు, చార్ కోల్ వంటి చిన్న తరహా అటవీ ఉత్పత్తుల సేకరణకు సంబంధించిన హక్కులు.
3. కోరిన ముసాయిదా అటవీ హక్కులు:

* నీటి వనరుల వినియోగం, చేపల పెంపకం, మనుషులకు, జీవాలకు తాగునీరు, తడి ప్రాంతాలపై హక్కులు
* మేత హక్కులు: సెక్షన్ 3 (1) (డి) పరిధిలో జీవాల మేత కోసం 2500 కిలోమీటర్ల విస్తీర్ణం పరిధిలో మేత హక్కులు, సీజనల్‌గా వనరుల అందుబాటుకు సంబంధించిన హక్కులు
* వ్యవసాయానికి ముందు నుంచీ అక్కడ ఉన్న కమ్యూనిటీలకు బన్నీ పచ్చిక బయలు ప్రాంతం మీద జీవాల మేత హక్కులు, ఆవాస హక్కులు

4. అటవీ హక్కుల చట్టం సెక్షన్ 3 (1) (ఐ) పరిధిలో అడవులు, జీవ వైవిధ్య పరిరక్షణకుగాను ఆ ప్రాంతం మీద యాజమాన్య, నిర్వహణ హక్కులు



5. అటవీ హక్కుల చట్టం సెక్షన్ 3 (1) (హెచ్) పరిధిలో అటవీ గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా మార్చడం, ఈ సెక్షన్ మేరకు ఆ ప్రాంతంలో ఉన్న అన్ని అటవీ గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా మార్చాలని కోరారు.
6. అటవీ హక్కుల చట్టం సెక్షన్ 3 (1) (కె) పరిధిలో, జీవ వైవిధ్య అందుబాటు హక్కులు, జీవ, సాంస్కృతిక వైవిధ్యతకు సంబంధించిన సాంప్రదాయ పరిజ్ఞానం, మేధోపర హక్కులపై సాముదాయిక హక్కులు – ముఖ్యంగా, స్థానిక /దేశీయ పశు /జాతులైన బన్నీ దున్నపోతు, కాంక్రేజ్ పశువులు. కాచ్చీ గుర్రాలు, కాచ్చీ గాడిదలు, దేశీయ జాతులకు చెందిన గొర్రెలు, మేకల సంరక్షణ, పరిరక్షణ, అభివృద్ధి అంశాలపై హక్కులు, ఈ దేశీయ జాతులతో కలిగే ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగా, వాటి అందుబాటు, ప్రయోజనాల పంపిణీ హక్కులు వంటివన్నీ ఇందులో ఉన్నాయి.
7. అటవీ హక్కుల చట్టం సెక్షన్ 3(1) (ఎల్) పరిధిలో, ఇతర సాంప్రదాయ హక్కులు ఏవైనా.

హక్కుల కోసం దరఖాస్తులు పెట్టడం, వాటి గుర్తింపు పొందటం వంటి ప్రక్రియలు  ఈ రీతిలో రెండు స్థాయిల్లో జరిగాయి. ఒకటి – బన్నీ పచ్చిక బయలు ప్రాంతంపై అక్కడ ఉన్న అన్ని గ్రామ సభలు తమకున్న సాముదాయిక అటవీ హక్కులు (సి.ఎఫ్.ఆర్.) గుర్తించడం. రెండవది – తమ గ్రామాలకు సమీపంలో ఉన్న ఇతర గ్రామాలు/ వినియోగ బృందాలకు అందుబాటు.

## * సాక్ష్యాధారాలు & డాక్యుమెంట్లు

బన్నీ ప్రాంతంలోని మాల్ధారీలు షెడ్యూల్డ్ జాతులకు చెందిన వాళ్ళు కాదు, అందుకే వాళ్ళను అటవీ హక్కుల చట్టం పరిధిలో ఇతర సాంప్రదాయ అటవీ జాతుల (ఓ.టి.ఎఫ్.డి.) కేటగిరీగా గుర్తింపు ఇచ్చారు. తమకు సాముదాయిక అటవీ హక్కులు ఇవ్వాలని కోరుతూ పెట్టుకున్న దరఖాస్తులు/ వాదనలకు తోడుగా వాళ్ళు ముఖ్యంగా రెండు రకాల సాక్ష్యాధారాలు/ డాక్యుమెంట్లు సమర్పించారు.

1. 19వ శతాబ్దపు చివరి కాలం, 20వ శతాబ్దపు ఆరంభంలో స్థానిక పాలకులు (మహారావులు) ఇచ్చిన ఎన్నో తీర్పులు – ఈ తీర్పులలో ఆ పాలకులు వీళ్ళతో పాటు, ఇతర పశు పోషక సమూహాలను, బన్నీ ప్రాంత వినియోగాన్ని ప్రస్తావించారు.
2. మాల్ధారీల వద్ద అప్పటి మహారావ్ పాలకులకు చెల్లించినట్లు ఉన్న మత పన్ను రసీదులు.

## * రాష్ట్ర, జిల్లా స్థాయి అధికార యంత్రాంగపు (డి.ఎల్.సి., ఎస్.డి.ఎల్.సి., రాష్ట్ర ప్రభుత్వం) పాత్ర

'బన్నీ హక్కుల అనుభవంలో అక్కడి బ్రీడర్స్ అసోసియేషన్ వంటి స్థానిక ప్రజా సంస్థల సమష్టి ప్రయత్నాలతో పాటుగా, రాష్ట్ర అధికార యంత్రాంగపు బాధ్యతాయుత, క్రియాశీలక పాత్ర కూడా కనబడుతుంది. పశు పోషక జాతులకు అటవీ హక్కులు కల్పించే క్రమంలో దరఖాస్తుల సేకరణ, హక్కుల గుర్తింపు ప్రక్రియలో అక్కడి జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) కీలక బాధ్యత తీసుకుంది. 2012లో గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని నాన్–షెడ్యూల్డ్ ప్రాంతాలలో కూడా అటవీ హక్కుల చట్టం అమలయ్యేలా ఆదేశాలు జారీ చేసింది. అది అనువుగా కచ్ జిల్లా కలెక్టర్ జిల్లాలో అటవీ ప్రాంతం ఉన్న చోట్లలో వెంటనే గ్రామసభల నిర్వహణ, సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.), జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఒక ఉద్యమం మాదిరిగా ఇవన్నీ ఏడాదిలోగా పూర్తి కావాలని స్పష్టంగా ఆదేశించారు. క్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిని జిల్లాలో అటవీ హక్కుల చట్టం (ఎఫ్.ఆర్.ఏ.) అమలు తీరును పర్యవేక్షించేందుకు నోడల్ ఆఫీసర్‌గా నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. గ్రామ సభలతో చర్చలు, సంప్రదింపుల ప్రక్రియలో సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.) చురుకైన పాత్ర నిర్వహించింది. అయితే ఇన్ని జరిగినా – ఇంకా జరగాల్సింది కొంత మిగిలే ఉన్నది. 48 గ్రామ సంఘాల దరఖాస్తు ప్రక్రియ, పరిశీలన పూర్తయి, ఆ దరఖాస్తులను అన్నింటినీ సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.), జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) ఆమోదించినప్పటికీ, అక్కడి పశు పోషక జాతులకు అధికారికంగా ఇప్పటికి సాముదాయిక అటవీ వనరుల హక్కుల టైటిల్స్ అందలేదు. గ్రామ సభలకు ఇంకా ఆ హక్కుల టైటిల్స్ అందాల్సి ఉంది. అయితే ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమిటంటే – హక్కుల దరఖాస్తు ప్రక్రియ విజయవంతమైనది. ఆ ప్రక్రియలకు అధికార యంత్రాంగం ఆమోదం కూడా లభించింది. అంటే హక్కులు సాధించుకునే ప్రక్రియ ఎలా ఉండాలి అనే దానిపై ఒక బ్లూ ప్రింట్ అయితే తయారైంది. ఇక మిగిలిందల్లా – హక్కుల టైటిల్స్ ఇంకా అందకపోవడం అదొక లోపమే. వీలయినంత త్వరగా దాన్ని సరిదిద్దాల్సి ఉంది.

## కేస్ స్టడీ 2

# పరిపాలన, భౌగోళిక హద్దుల పరిమితులు దాటి, పశు పోషక కమ్యూనిటీల హక్కుల దరఖాస్తు, గుర్తింపు – హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లా ముల్తాన్ తహశీల్ ప్రాంత అనుభవం

### * నేపథ్యం

పర్వత ప్రాంతాలలో పశు జీవాల పోషణ మాదిరిగానే, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలలో కూడా పశు పోషణ అంటే వేసవి, వానా కాలాల్లో ఎత్తయిన పర్వత ప్రాంతాలలోని పచ్చిక బయళ్ళలో జీవాలను మేపడం, చలి కాలంలో హిమాలయ పర్వత ప్రాంతాల దిగువన ఉన్న అడవులలో జీవాలను మేపుతూ గడపడం. ఈ వేసవి, చలి కాలాల మధ్య నాలుగు నెలల కాలం వాళ్ళు ఆయా ప్రాంతాలకు రావడానికి, పోవడానికి సరిపోతుంది. ఇలా వలస వెళ్ళే సమయంలో, వాళ్ళు రోడ్డు పక్కన లేదా గ్రామ ఉమ్మడి ప్రాంతాలు లేదా అటవీ ప్రాంతాలలో తమ జీవాలను మేపుతారు. 1999లో దౌలాధర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని నోటిఫై చేశారు. ఆ తరువాత ముఖ్యంగా 2008 నుంచి ఆ ప్రాంతంలో జీవాలను మేపడంపై నియంత్రణలు బాగా పెరిగి పోయాయి. ఈ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం మొత్తం విస్తీర్ణం 1000 కిలోమీటర్లు కాగా అందులో 700 కిలోమీటర్ల ప్రాంతం ఎప్పటినుంచో ఉమ్మడి మేత ప్రాంతంగా ఉంది. ముల్తాన్ ప్రాంతానికి చెందిన దాదాపు 200 వ్యవసాయ–పశుపోషక కుటుంబాలు ఎన్నో ఏళ్ళుగా దాన్ని వాడుకుంటున్నాయి. వీళ్ళే కాకుండా ఇతర పశు పోషక కమ్యూనిటీలకు చెందిన దాదాపు 600 కుటుంబాలు ఈ ఉమ్మడి భూమిని వేసవి కాలంలో తమ జీవాలను మేపడానికి వాడుకుంటారు. కొన్ని శతాబ్దాలుగా వీళ్ళు ఇలా ఈ ప్రాంతాన్ని వాడుకుంటున్నారు.

### * గ్రామ సభ & అటవీ హక్కుల కమిటీ ఏర్పాటు

హిమాచల్ ప్రదేశ్‌లో అటవీ హక్కుల చట్టం తొలుత షెడ్యూల్–5 ఏరియాలకు మాత్రమే పరిమితమైంది. లాహౌర్, స్పిటితో పాటు చంబా జిల్లాలోని కొంత ప్రాంతంలో ఈ చట్టం అమలయ్యేది. తరువాత దానిని రాష్ట్రం అంతటికీ విస్తరించారు. 2014 నుంచి ఇక్కడ అటవీ హక్కుల కమిటీల ఏర్పాటు మొదలయ్యింది.

### * అటవీ హక్కుల నిర్ధారణ & హక్కుల కోసం దరఖాస్తులు

ముల్తాన్ ప్రాంతంలో అటవీ హక్కులకు దరఖాస్తు చేసుకునే ప్రక్రియలో అక్కడి పశుపోషక కమ్యూనిటీలు స్థానికంగా ఉన్న 28 గ్రామ సభలకు చెందిన కుటుంబాలతో పాటుగా, ఆ వేసవిలో జీవాల మేత కోసం ముల్తాన్ ప్రాంతానికి వచ్చే పొరుగు జిల్లాలకు చెందిన కుటుంబాల వాళ్ళను కూడా కలుపు పోయారు. విభిన్న భాగస్వాములను కలుపుకుపోతూ, అక్కడి ఉమ్మడి వనరులపై ఉమ్మడి యాజమాన్యం చేపడుతున్నామన్న వాదనకు బలం చేకూర్చడమే ఈ వ్యూహం వెనుక ఉద్దేశం. ఈ రీతిలో ఆయా పొరుగు జిల్లాల నుంచి ముల్తాన్ ప్రాంతానికి వచ్చే వాళ్ళ వివరాలతో పాటు వాళ్ళలో ఎవరెవరు ఎప్పుడు వస్తారు అనే స్పష్టమైన వివరాలతో ఒక జాబితా రూపొందించారు. అదే రీతిలో స్థానికంగా ముల్తాన్ ప్రాంతానికి చెందిన పశు కాపరులు, చలి కాలంలో ఏయే అడవులను మేత కోసం వినియోగించుకుంటారు అనే వివరాలతో మరో జాబితా తయారు చేశారు.

ఈ రీతిలో అక్కడి మేత ప్రాంతాలు, సంచార పశు కాపరులు వలస వెళ్ళే మార్గాలు, బస చేసే ప్రాంతాల వివరాలతో వనరుల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేశారు.




హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రా ప్రాంతంలో ఒక ఆఫీసులో అటవీ హక్కుల దరఖాస్తులు ఇస్తున్న కమ్యూనిటీ సభ్యులు



హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రా ప్రాంతంలో అటవీ హక్కుల కోసం దరఖాస్తు చేసి తరువాత కమ్యూనిటీ సభ్యుల సమావేశం

దరఖాస్తుల ప్రక్రియలో వాళ్ళు ఎందుర్కొన్న ప్రధాన సమస్య – ఒకటి కంటే ఎక్కువ గ్రామ సభల హద్దులలో మేత మేపినప్పుడు ఏ గ్రామ సభలో హక్కుల కోసం దరఖాస్తు చేయాలనేది ఒకటి. ఇక రెండో అంశం – వలస వెళ్ళే మార్గాలలో అన్ని గ్రామ సభల ఆమోదం పొందే ప్రక్రియ. చివరికి వాళ్ళు ఒక నిర్ణయానికి వచ్చారు. ఎక్కడైతే తాము నివాసం ఉంటామో ఆ గ్రామ సభ పరిధిలోనే హక్కుల దరఖాస్తులు సమర్పించాలని అనుకున్నారు. అదే క్రమంలో వాళ్ళు వలస వెళ్ళే మార్గాలు, బస చేసే ప్రాంతాల వివరాలు అన్నీ ఆ దరఖాస్తులలో పొందుపరిచారు. ఈ విధంగా పశు కాపరులు తమ వాస్తవిక నివాస గ్రామాల్లోనే హక్కుల కోసం దరఖాస్తులు పెట్టుకున్నారు. అక్కడి గ్రామ సభలు ఆ దరఖాస్తులను స్వీకరించాయి. వాటిని పరిశీలించి, తీర్మానాలు చేసి, ఆమోదం కోసం సంబంధిత సబ్ డివిజన్ లెవెల్ కమిటీకి పంపారు. వనరుల మ్యాపింగ్ ప్రక్రియ అంతా పశు పోషకుల సమక్షంలోనే పూర్తయింది.

నిజానికి పశు పోషక కమ్యూనిటీలు, సంచార పశు కాపరులు ఇలా ఒకటి కంటే ఎక్కువ జిల్లాల మధ్య ఉన్న ప్రాంతం మీద అటవీ హక్కులను పొందాలని చేసిన తొలి ప్రయత్నం ఇదే. దాంతో దరఖాస్తుల డాక్యుమెంటేషన్ ప్రక్రియ పక్కాగా చేశారు. స్థానిక మేత ప్రాంతాలతో పాటుగా వలస వెళ్ళే మార్గాలలో ఉండే మేత ప్రాంతాలను కూడా అందులో కలిపారు. ముఖ్యంగా వలస వెళ్ళే మార్గాలలో పశు కాపరులు ఎక్కడ బస చేస్తారు, ఏ నీటి వనరులను వాడుకుంటారు అనే అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. అంతేకాకుండా ఆ గ్రామాలు/ అడవులకు సంబంధించి అన్ని గ్రామ సభలు, అటవీ హక్కుల కమిటీ (ఎఫ్.ఆర్.సి.)లు, సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ (ఎస్.డి.ఎల్.సి.)లు, జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.)ల వివరాలతో జాబితా తయారు చేశారు.

విభిన్న భాగస్వామ్య పక్షాలతో పలుమార్లు చర్చలు, సమావేశాలు జరిగాయి. వీటిలో హద్దుల గుర్తింపు, హక్కుల స్వభావం వంటి అంశాలు అన్నీ వివరంగా చర్చించుకున్నారు. తరువాత కాలంలో ఎలాంటి సమస్య, భేదాభిప్రాయాలు తలెత్తకుండా, దరఖాస్తులు పెట్టే ముందుగానే ఈ అంశాలపై ఒక స్పష్టతకు వచ్చే ప్రయత్నం చేశారు. ఉదాహరణకు బడా గ్రాన్ గ్రామ సభ స్థానికంగా తమ వాళ్ళు మేత మేపే ప్రాంతంపై హద్దులు నిర్ణయించుకున్నారు. అదే క్రమంలో ఎక్కడెక్కడ బయటి గొర్రెల కాపరులు మేత మేపుకోవడానికి అనుమతి ఇవ్వాలనేది కూడా నిర్ణయించుకున్నారు. బారా బంగాల్ గ్రామ సభ మరో రీతిలో నిర్ణయం తీసుకుంది. బయటి నుంచి వచ్చే గొర్రెల కాపరులకు కేవలం మేత హక్కులు మాత్రమే ఇస్తామని, అక్కడ స్థానికంగా దొరికే ఔషధ మొక్కల సేకరణకు హక్కులు ఇవ్వలేమని చెప్పారు. రల్లింగ్ గ్రామ సభలో ఫెసిలిటేటర్లు అక్కడి అటవీ ప్రాంతాన్ని వినియోగించే విభిన్న సమూహాలతో విడివిడిగానూ, సమష్టిగానూ చర్చలు జరిపి వాళ్ళ మధ్య ఒక అంగీకారం కుదిర్చారు. అక్కడి కమ్యూనిటీలతో పాటు వేసవి కాలంలో జీవాల మేత కోసం బయటి నుంచి వచ్చే వాళ్ళతో కలిసి గ్రామ సభ ఏర్పాటు చేయడం ఆ చర్చల ప్రధాన అంశం. నిజానికి బయటి నుంచి వచ్చే వాళ్ళు ఆ ప్రాంతంలో ఏమీ బస చేయరు. వేసవిలో జీవాలను మేపుతూ ఆ గ్రామ పరిధి గుండా వెళతారు. వాళ్ళకు కూడా గ్రామ సభలో ప్రాతినిధ్యం కల్పించడానికి ఈ చర్చలు జరిపారు. అదే క్రమంలో రల్లింగ్ ప్రాంతంలో నివాసం ఉండేవాళ్ళు చలికాలంలో తమ జీవాల మేత కోసం వెళ్ళే పొరుగు గ్రామాల కమ్యూనిటీలతోనూ చర్చలు జరిపారు. ఇలా మొత్తం అన్ని కమ్యూనిటీలతోనూ చర్చలు జరిగి ఉమ్మడి నిర్ణయాలు తీసుకోవడానికి వాళ్ళకు దాదాపు రెండేళ్ళు పట్టింది. ఆ చర్చలు, వాళ్ళ ఉమ్మడి నిర్ణయాలు, పశు పోషక సమూహాలలో ఉండే సహజీవన తత్వానికి, నిజమైన ప్రజాస్వామ్య విలువలకు, అటవీ హక్కుల చట్టం స్ఫూర్తికి అద్దం పట్టాయి.

## * సాక్ష్యాధారాలు & డాక్యుమెంట్లు

హిమాచల్‌ప్రదేశ్‌లో అటవీ వనరులపై హక్కులు పొందడానికి అక్కడి కమ్యూనిటీలు 'వాజిబ్–ఉల్ అర్జ్' (సాంప్రదాయాల రికార్డు) అనే రికార్డును సాక్ష్యాధారంగా చూపారు. ఏ అటవీ వనరుల మీద హక్కులు కోరుతున్నారో, అవి వాళ్ళకు చారిత్రకంగా ఎన్నో ఏళ్ళుగా అందుబాటులో ఉండటం, వాటిని వాళ్లు వాడుకోవడం వంటి అంశాలకు ఆ రికార్డు సాక్ష్యంగా నిలిచింది. కర్నూతూ గ్రామ సభలో అక్కడి కమ్యూనిటీలు సంబంధిత అటవీ విభాగం (పాలంపూరు) ఎప్పుడో రూపొందించిన ఒక పాత ఆచరణాత్మక ప్రణాళిక కాపీని, దాంతో పాటు అందర్ సన్ 'ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫ్ 1887' కాపీని సాక్ష్యంగా అందించారు.

## * అధికార యంత్రాంగపు సహాయక పాత్ర - నిర్వహించిన బాధ్యతలు

కొన్ని సబ్ డివిజన్లు లేదా కొన్ని జిల్లాల హద్దుల పరిధిలో ఉండే అటవీ ప్రాంతం మీద హక్కులు కోరుతున్న దరఖాస్తులు ఉన్నప్పుడు, సంబంధిత అధికార యంత్రాంగం అంతటికి ఆ దరఖాస్తులు చేరవేసే బాధ్యత దరఖాస్తు చేసిన కుటుంబానికి కాదు లేదా సంబంధిత గ్రామ సభ బాధ్యత కాదు. ఆ బాధ్యత జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) మీద ఉంటుంది. ఈ అంశానికి సంబంధించి, కాగా ప్రాంతం లోపల, దాని చుట్టుపక్కల ఉండే పశు పోషక కమ్యూనిటీలు అటవీ హక్కుల చట్టంలోని అంశాలను వాడుకున్నాయి. ఈ చట్టంలోని సెక్షన్ (8) (ఇ) ప్రకారం 'అంతర్గత–జిల్లాల హద్దులకు సంబంధించి వచ్చే అటవీ హక్కుల దరఖాస్తుల విషయంలో మిగతా జిల్లాలతో సమన్వయం చేసుకునే బాధ్యత జిల్లా స్థాయి కమిటీ (డి.ఎల్.సి.) పైన ఉన్నది.

## * సాముదాయిక అటవీ హక్కుల టైటిల్స్

పశుపోషక కమ్యూనిటీల విషయంలో సాముదాయిక అటవీ హక్కులకు రెండు అంచెల స్వభావం ఉన్నది – మామూలుగా ఆ హక్కులు సాముదాయిక స్వభావం కలిగినవి కానీ ఆచరణాత్మకంగా అవి వ్యక్తిగతమైనవి, సాముదాయిన హక్కుల టైటిల్ సంబంధిత గ్రామ సభ పరిధిలో శాశ్వత నివాసం ఉన్న వాళ్ళందరి పేరు మీద ఇస్తారు. అయితే అదే క్రమంలో ఆ సాముదాయిక అటవీ వనరుల ప్రాంతంలో ఉండే పశు పోషక కమ్యూనిటీలు, సంచార సమూహాలకు సీజనల్‌గా ఆ వనరుల అందుబాటు, వినియోగపరమైన హక్కులు ఉంటాయని, వాటికి సంబంధిత గ్రామ సభ గౌరవించాలని అందులో స్పష్టంగా చెబుతారు. చట్టంలోని సెక్షన్ 3 (1) (డి) ఇదే విషయాన్ని చెబుతుంది. అదే క్రమంలో ఆ సాముదాయిక అటవీ వనరుల ప్రాంతాన్ని సుస్థిరంగా వినియోగించుకునేలా, ఆ వనరుల అందుబాటును నియంత్రించడానికి అక్కడి గ్రామ సభ, ఆ వనరులు వాడుకునే విభిన్న వినియోగ బృందాలు కలిసి సమష్టిగా తగిన నియమాలు రూపొందించుకోవాలని ఈ చట్టంలోని సెక్షన్ 5 చెబుతుంది.

